వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 145 | 07-10-2026 | బుధవారం | పేజీలు: 10 | వెల: 3/-



పైలట్ కెప్టెన్
## స్మిత్ మచ్చర్

- ఫైదుబాయ్ ఘటనలో గాయపడిన పైలట్
- పైలట్‌పై కోపైలట్ గొడ్డలితో దాడి
- తల, వీపుపై తీవ్ర గాయాలు
- విపరీతంగా రక్తస్రావం
- సౌదీలో అత్యవసర శస్త్రచికిత్స
- యూఏఈ మిలిటరీ ఆసుపత్రికి తరలింపు
- శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు
- ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి స్థిరం
- భారత అధికారులు పరిస్థితిని పర్యవేక్షణ
- పైలట్‌ను కలిసిన కుటుంబసభ్యులు

2

## 45 ఎకరాలు ఏమయ్యాయి?



- ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో 45 ఎకరాల మిస్సింగ్
- కేసీఆర్ కుటుంబానికి రెవెన్యూ రికార్డుల్లపై నోటీసులు
- అర్హులైన పేద రైతులకు భూముల పంపిణీకి నిర్ణయం
- అమరవీరుల కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ

3

## ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్..

- SIR ఫార్మ్-7పై ఒవైసీ తీవ్ర అభ్యంతరాలు
- ముస్లిం ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ
- ఒడిశాలో తెలంగాణ తోలు వ్యాపారుల సమస్యపై సీఎస్‌కు విజ్ఞప్తి
- ఎల్‌నినో ప్రభావంపై సమగ్ర నివేదికకు సీఎస్ ఆదేశాలు

హైదరాబాద్, (డీడీ9 వార్త): రాష్ట్రంలో ముస్లిం ఓట్లను పథకం ప్రకారం తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఎలక్షన్ కమిషన్‌లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అనుమానాలు వ్యక్తం చేశారు. అసలు ఎన్నికల కమిషన్‌కు, భారతీయ జనతా పార్టీకి ఉన్న సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో చీఫ్ ఎలక్షన్

మిగతా 2లో..





2

విపక్షాల నిరసనకు
## బీజేడీ మద్దతు

- నవీన్‌కు మమత ధన్యవాదాలు
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఇండియా కూటమి చేపట్టిన మార్చ్‌లో బీజేడీ ఎంపీలు
- ఇండియా కూటమిలో భాగస్వామి కాకపోయినా మద్దతు
- మార్చ్‌లో పాల్గొన్న మానస్ మంగరాజ్, సులతా దేవ్
- నవీన్ పట్నాయక్ ఆదేశాలతోనే పాల్గొన్నాం: మంగరాజ్
- బీజేడీకి మమతా బెనర్జీ కృతజ్ఞతలు
- విపక్షాల మధ్య సమన్వయం అవసరం
- ఇండియా కూటమితో బీజేడీకి అధికారిక సంబంధం లేదు



## కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటీ పనులు రద్దు

- కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం రద్దు
- ప్రాజెక్టు రీడిజైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- మేఘా సంస్థకు రీడిజైన్ బాధ్యతలు
- కేఎన్‌ఆర్ సంస్థకు ఇచ్చిన లెటర్ ఆఫ్ అవార్డు ఉపసంహరణ
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముఫకంజా కాలేజీ వరకు స్టీల్ బ్రిడ్జి
- బంజారాహిల్స్ రోడ్ నం-1కు ప్రత్యేక ర్యాంప్
- రూ.1,090 కోట్ల పాత ప్రాజెక్టు వ్యయంలో భారీ కోత
- రెండు ప్యాకేజీలుగా కొత్త ప్రాజెక్టు పనులు
- భూసేకరణ, నిర్మాణ వ్యయం తగ్గుతుందని అంచనా
- మొత్తంగా రూ.1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుందని అంచనా

హైదరాబాద్, (డీడీ9 వార్త): కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్కు చుట్టూ ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రాజెక్టును రీడిజైన్ చేసి కొత్త విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. రీడిజైన్ బాధ్యతలను మేఘా సంస్థకు అప్పగించారు. టెండర్ ప్రక్రియలో చెల్లించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని

మిగతా 2 లో..

## కరెంట్ డిమాండ్‌లో బిగ్ రికార్డ్..
### 20 వేల మెగావాట్లకు చేరిక.!

- పులిచింతల పవర్ ప్లాంట్‌ను పరిశీలించిన భట్టి విక్రమార్క
- రాష్ట్రంలో సరికొత్త రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్
- ఎల్‌నినో ప్రభావంతో 4 వేల మెగావాట్ల జలవిద్యుత్ తగ్గుదల
- విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్న సంస్థలు



హైదరాబాద్, (డీడీ9 వార్త): సూర్యాపేట జిల్లాలోని పులిచింతల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, ఇప్పటివరకు జరిగిన విద్యుత్ ఉత్పత్తి వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనిట్ కంట్రోల్ రూమ్‌ను స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సీఎం, ప్రాజెక్టు నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి తీరుపై అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు.

**20 వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్**

అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగి సరికొత్త రికార్డులను తాకుతోందని తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ట

మిగతా 2లో..



3

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

- ఢిల్లీలో విపక్షాల ఆందోళన
- ఇండియా కూటమి నేతల భారీ ర్యాలీ
- పార్లమెంట్ మకర ద్వారం నుంచి మార్చ్ ఈ
- ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీ
- 'సేవ్ డెమోక్రసీ' బ్యానర్లతో నిరసన
- ఆకాశవాణి భవన్ వద్ద పోలీసుల అడ్డుకట్ట
- రోడ్డుపై బైఠాయించిన రాహుల్, ఖర్గే, ప్రియాంక
- బారికేడ్లపైకి ఎక్కిన రాహుల్ గాంధీ
- జాతీయ జెండాతో నిరసన తెలిపిన కాంగ్రెస్ నేత

## సిరిసిల్లకు సీఎం ఏం ఇచ్చారు?..

- తెలంగాణ, టీఆర్ఎస్ బాగుండాలని రాజన్నను వేడుకున్న కవిత
- రాజన్న ఆలయ అభివృద్ధికి ఎవరు నిధులు ఇచ్చినా స్వాగతం
- రూ.200 కోట్ల కేటాయింపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ
- ఆలయ నిర్మాణంలో కాంక్రీట్‌కు బదులు కృష్ణశిల వాడాలి
- రాజన్న ఆలయంలో కోడెల మృతిపై ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత
- ఆలయ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపణ

హైదరాబాద్, (డీడీ9 వార్త): వేములవాడ పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు 'కవిత' మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ఆమె ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం, టీఆర్ఎస్ పార్టీ బాగుండాలని రాజన్నను వేడుకున్నట్లు ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేములవాడ రాజన్న ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని.. ఆలయానికి ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయని, ఎవరు నిధులు ఇచ్చినా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో కాంక్రీట్‌కు బదులుగా కృష్ణశిలను ఉపయోగించాలని ఆమె కోరారు. రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి బండి సంజయ్ పట్టించుకోవడం

మిగతా 2లో..



## రాష్ట్రంలో ఒకవైపు కరెంట్ కోతలు.. మరోవైపు కరెంటు బిల్లులతో వాతలు..

- ట్రూ-అప్ ఛార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారం మోపేందుకు కుట్ర: హరీశ్‌రావు
- కరెంట్ కోతలు.. భారీ బిల్లులతో ప్రజల నడ్డి విరుస్తున్నారు
- కేసీఆర్ హయాంలో ప్రజలపై ట్రూ-అప్ భారం మోపలేదు
- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ రంగం పూర్తిగా విఫలమైంది
- బొగ్గు నిల్వలు, నీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు
- నిర్వహణ లోపాలతో థర్మల్ ప్లాంట్లు మూతపడుతున్నాయి
- విద్యుత్ సరఫరా లేక రైతులు పొలాల వద్దే పడిగాపులు
- రూ.91 వేల కోట్లతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేశాం: హరీశ్‌రావు



హైదరాబాద్, (డీడీ9 వార్త): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యుత్ రంగ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్తలు చెప్పాల్సింది పోయి, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఏకంగా రూ.5,420 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన రుద్దాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు

మిగతా 2లో..

## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు నిర్మాణం
- కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- 480 మంది లబ్ధిదారుల ఎంపిక
- బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక
- 7 వేల మందికి పైగా ఇళ్ల కోసం దరఖాస్తులు
- 5,218 మందిని అర్హులుగా గుర్తింపు
- ముందుగా పూర్తి చేసే కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు
- ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు
- రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షలు



హైదరాబాద్, (డీడీ9 వార్త): సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని

మిగతా 2లో..

## తెలంగాణ సంస్కృతికి, మహిళా శక్తికి బతుకమ్మ ప్రతీక

- కులమతాలకు అతీతంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిద్దాం
- తెలంగాణ సంస్కృతికి, మహిళా శక్తికి బతుకమ్మ ప్రతీక
- చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన కిషన్‌రెడ్డి
- నిజాం, రజాకార్ల దౌర్జన్యాలను తట్టుకున్న తెలంగాణ ఆడబిడ్డలు
- మన సంస్కృతే మన బలం.. ఐక్యంగా బతుకమ్మ జరుపుకుందాం
- ఈ నెల 17న అంబర్‌పేటలో బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్, (డీడీ9 వార్త): హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన మహిళా సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు అంబర్‌పేట ప్రాంత ప్రజలంతా కులమతాలకు అతీతంగా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని పూజిస్తూ అందరూ కలిసికట్టుగా ఆడుకునే ఈ పండుగ మన పూర్వీకుల సంస్కృతికి, మహిళా శక్తికి నిలువెత్తు ప్రతీక

మిగతా 2లో..

# కరెంట్ డిమాండ్‌లో బిగ్ రికార్డ్..

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్ డిమాండ్ (పీక్ డిమాండ్) 15,000 మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం అది ఏకంగా 20,000 మెగావాట్లకు చేరుకుందని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జల విద్యుత్ ఉత్పత్తి సుమారు 4,000 మెగావాట్ల మేర తగ్గిందని, పెరిగిన డిమాండ్ , తగ్గిన ఉత్పత్తిని కలిపి విద్యుత్ వ్యవస్థపై మొత్తంగా 8,000 మెగావాట్ల అదనపు భారం పడిందని వివరించారు.

**అదనపు భారమైనా నిరంతర సరఫరా.. విద్యుత్ సంస్థల సమర్థత**

వ్యవస్థపై ఇంతటి భారీ భారం పడినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సమర్థవంతంగా నిర్వహణ సాగిస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా గృహ వినియోగదారులకు 24 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయని భట్టి విక్రమార్క అభినందించారు.



## కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్‌సిటీ పనులు రద్దు

**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయించారు. కేఎన్ఆర్ నిర్మాణ సంస్థకు గతంలో జారీ చేసిన లెటర్ ఆఫ్ అవార్డును కూడా ఉపసంహరించారు.

కొత్త ప్రతిపాదనలో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముఫకంజా కాలేజీ వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఈ వంతెనను బంజారాహిల్స్ రోడ్ నం1కు అనుసంధానించేలా ర్యాంప్ ఏర్పాటు చేయనున్నారు.

**రెండు ప్యాకేజీలుగా పనులు**

ఈపీసీ విధానంలో ఆధునిక స్టీల్ స్ట్రక్చర్ సాంకేతికతతో కొత్త ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముగ్దా జంక్షన్ వరకు తొలి ప్యాకేజీలో పనులు చేపడతారు. ముగ్దా జంక్షన్ నుంచి ముఫకంజా కాలేజీ వరకు రెండో ప్యాకేజీ నిర్మిస్తారు.

కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానాన్ని శాశ్వతంగా అమలు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఆరు లేన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది నాటికి దాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కేబీఆర్ పార్కు నుంచి అండర్‌పాస్ నిర్మాణం కూడా చేపడతామని వివరించారు.

**రూ.1,090 కోట్ల నుంచి భారీగా తగ్గింపు**

కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టనున్న ప్రాజెక్టుకు గతంలో రూ.1,090 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రీడిజైన్‌లో భాగంగా ఈ వ్యయాన్ని భారీగా తగ్గించారు. ప్యాకేజీ 1కు గతంలో మంజూరైన రూ.580 కోట్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ.365 కోట్లకు తగ్గించారు. ప్యాకేజీ2లో రూ.510 కోట్లుగా ఉన్న వ్యయాన్ని రూ.349 కోట్లకు కుదించారు.

**రూ.1,200 కోట్ల ప్రజాధనం ఆదా**

ఎలివేటెడ్ కారిడార్‌ను ఒకే సమగ్ర మార్గంగా రూపొందించడం వల్ల ఖరీదైన ప్రైవేటు భూముల సేకరణ అవసరం గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. దీనివల్ల సుమారు రూ.800 కోట్లు ఆదా కానుందని తెలిపారు.

గతంలో ప్రతిపాదించిన బహుళ అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణంతో పోలిస్తే మరో రూ.400 కోట్ల నిర్మాణ వ్యయం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. మొత్తంగా సుమారు రూ.1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుందని పేర్కొన్నారు.



## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

గాజుల రామారంలో మంగళవారం ఇందిరమ్మ టవర్స్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని ఏడాదిలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని పొంగులేటి తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. ఒక నెల ముందుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని మంత్రి వెల్లడించారు.

**ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని పొంగులేటి తెలిపారు. వీరిలో 5,218 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని తెలిపారు.

**పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం**

ఇతర ప్రభుత్వ శాఖలు, హౌసింగ్ శాఖకు చెందిన భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడతామని పొంగులేటి తెలిపారు. నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## రాష్ట్రంలో ఒకవైపు కరెంట్ కోతలు.. మరోవైపు కరెంటు బిల్లులతో వాతలు..

**మొదటిపేజీ తరువాయి**

కరెంట్ కోతలు, మరోవైపు భారీ విద్యుత్ బిల్లులతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో గతంలో రూ.12,700 కోట్లకు పైగా ట్రూఅప్ ఛార్జీలు వేయాలని ఈఆర్సీ సూచించినా, ప్రజలపై ఆ ఆర్థిక భారాన్ని మోపడానికి కేసీఆర్ ఎప్పుడూ అనుమతించలేదని గుర్తుచేశారు.

రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వహణ లోపాలు, సంపూర్ణ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.91 వేల కోట్లతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి, సబ్ స్టేషన్లను, ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించామని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు నిల్వలు, రిజర్వాయర్లలో నీటిని సద్వినియోగం చేసుకోలేక విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. సరైన నిర్వహణ లేక థర్మల్ ప్లాంట్లు మూతపడుతున్నాయని, కరెంట్ సరఫరా లేక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాస్తూ పాము కాట్లకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చాలదన్నట్లుగా వేల కోట్ల విలువైన ట్రాన్స్‌కో, జెన్కోలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తారని, కానీ ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ మాత్రం ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెడుతోందని ఎద్దేవా చేశారు. తక్షణమే ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.5,420 కోట్ల భారాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక తుగ్లక్ నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## సిరిసిల్లకు సీఎం ఏం ఇచ్చారు?..

**మొదటిపేజీ తరువాయి**

లేదని ఆరోపించారు.

వేములవాడలో రోడ్లు, మార్కెట్, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కవిత పేర్కొన్నారు. చేపట్టిన పలు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, రైతుల కోసం సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేములవాడ పట్టణంలో దుమ్ము సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని కోరారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజన్న చెరువు ప్రక్షాళన కోసం విప్ ఆది శ్రీనివాస్ నిధులు తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. గతంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్లను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం వేములవాడ అభివృద్ధి బాధ్యతలు చూస్తున్న ఆది శ్రీనివాస్ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. అధికార దర్పం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. తన తల్లిదండ్రుల వివాహం కూడా వేములవాడలోనే జరిగిందని కవిత గుర్తుచేశారు. ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి అనుబంధం ఉందన్నారు.

వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు నీటి బొట్టు కూడా రాలేదని ఆమె విమర్శించారు. గత ప్రభుత్వంలో మంత్రి హరీశ్‌రావు చెప్పిన ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. రుద్రంగి వద్ద రూ.200 కోట్లతో 2.5 టీఎంసీల రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో చెప్పారని, ఆ హామీ ఏమైందని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కలగడం లేదని అన్నారు. రైతుల కోసం మంత్రి బండి సంజయ్, ఆది శ్రీనివాస్ తమ పలుకుబడిని ఉపయోగించి రుద్రంగి, ధూంపేట తదితర ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందో, అడుక్కుంటుందో తమకు తెలియదని, కానీ రైతులకు మాత్రం కరెంట్ అందాల్సిందేనని అన్నారు. ప్రజా సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సిరిసిల్లకు ముఖ్యమంత్రి ఏదో ఒక భారీ ప్రకటన చేస్తారని భావించినప్పటికీ, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కవిత విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు అభివృద్ధికి సంబంధించి ఎలాంటి కీలక ప్రకటన చేయలేదన్నారు. సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని గతంలో చెప్పారని, అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి చేయడం తెలియదని కవిత విమర్శించారు. రైల్వే లైన్ పనులు కూడా అక్కడక్కడ నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయాలని టీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. గల్ఫ్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని, గల్ఫ్ అడ్వైజరీ కమిటీ నుంచి సభ్యులు తప్పుకుంటున్నారని అన్నారు. సిరిసిల్ల జేఎన్‌టీయూ విద్యార్థులు ల్యాబ్ సౌకర్యాల కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని కవిత పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే కేటీఆర్, ఆది శ్రీనివాస్, బండి సంజయ్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) కు దేశంలోనే ప్రత్యేక చరిత్ర ఉందని కవిత అన్నారు. సెస్‌ను ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేసిన తర్వాత విద్యుత్ పోల్ దెబ్బతిన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆరోపించారు. సెస్‌లో గతంలో అవినీతి జరిగిందని, ఫైర్ ప్రమాదంలో కీలక ఫైల్స్ కాలిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. నేరెళ్ల బాధితుల ఫైల్స్ కూడా కాలిపోయాయని కవిత ఆరోపించారు. సీఎం సిరిసిల్ల సభలో నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా టీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు.

కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యల మధ్య పొంతన లేదని కవిత విమర్శించారు. రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే సీఎంగా ఉంటానని చెబుతుంటే, మరోవైపు బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఈ పరిణామాలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ మధ్య "విడాకులు అయ్యాయి" అంటూ కవిత వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులకు కూడా అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా ముస్లిం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు. మాజీ మావోయిస్టులు టీఆర్ఎస్ పార్టీలోకి రావాలని కవిత పిలుపునిచ్చారు. వారిని పార్టీలోకి స్వాగతిస్తామని, మావోయిస్టుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కవిత అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ విద్యా రంగంపై నియంత్రణ తీసుకొస్తామని, ప్రస్తుతం ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇంకా ముంపు గ్రామాల సమస్యలపైనా పోరాటం చేస్తామని కవిత అన్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## తెలంగాణ సంస్కృతికి, మహిళా శక్తికి బతుకమ్మ ప్రతీక

**మొదటిపేజీ తరువాయి**

అని కొనియాడారు. నిజాం దారుణ పాలనకు, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ లాంటి వీరవనితలు బతుకమ్మను సాక్షిగా చేసుకునే పోరాటాలు చేశారని చారిత్రక అంశాలను గుర్తుచేశారు. నిజాం ప్రైవేట్ సైన్యం తెలంగాణ ఆడబిడ్డలపై చేసిన దౌర్జన్యాల రోజులను వివరిస్తూ, మన సంస్కృతే మన బలంగా నిలిచిందని పేర్కొన్నారు.

**అన్ని రంగాల్లోనూ ముందంజలో భారత నారీమణులు**

నేటి భారతదేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభను కనబరుస్తూ దేశ కీర్తిని నలుదిశలా చాటుతున్నారని కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాధారణ గిరిజన కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించడం, తెలంగాణ కోడలు నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ రక్షణ, ఆర్థిక వ్యవస్థలను నడిపించడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. విమానాలు, అంతరిక్ష నౌకలు, యుద్ధ విమానాలు నడపడంతో పాటు సరిహద్దుల్లో సైనిక బలగాల్లోనూ, బహుళజాతి కంపెనీల సారథ్యంలోనూ మహిళలే ముందంజలో ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన మెజారిటీ పతకాలు మన ఆడబిడ్డలే సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారని అభినందించారు.

**మహిళా సంఘాలకు కేంద్ర ప్రోత్సాహం.. డ్రగ్స్ రహిత తెలంగాణకై పిలుపు**

హైదరాబాద్ ఐటీ రంగాభివృద్ధిలోనూ మన ఆడబిడ్డలు కీలక పాత్ర పోషిస్తున్నారని, స్వయం సహాయక మహిళా సంఘాలకు



(పొదుపు సంఘాలు) ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.20 లక్షల వరకు బ్యాంక్ రుణాలను అందిస్తూ స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోందని కిషన్ రెడ్డి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మహమ్మారి విస్తరిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్ తరహా పరిస్థితులు తెలంగాణకు రాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు.

2029 నాటికి భారతదేశాన్ని 'నషా ముక్త భారత్'గా మార్చాలనే ప్రధాని మోదీ సంకల్పంలో భాగంగా, నవంబర్ నెలలో హైదరాబాద్‌లో రాజకీయాలకు అతీతంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మాదకద్రవ్యాల వ్యతిరేక పాదయాత్రలో తెలంగాణ ఆడబిడ్డలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్..

**మొదటిపేజీ తరువాయి**

కమిషనర్ ఎంపిక ప్రక్రియే సరైన విధానంలో జరగలేదని విమర్శించిన ఒవైసీ, ప్రస్తుత 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (SIR) పేరుతో వెనుక తలుపు గుండా ఎన్ఆర్సీ (NRC) ని తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**ఒడిశాలో తోలు వ్యాపారుల ఆవేదన.. సీఎం జోక్యానికి విజ్ఞప్తి**

రాష్ట్రంలోని తోలు వ్యాపారులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై కూడా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. తెలంగాణ నుంచి మేకలు, బర్రెలు, ఆవుల తోలును సేకరించి ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు రవాణా చేస్తూ చట్టబద్ధంగా వ్యాపారం చేసుకుంటున్నారని, ప్రభుత్వానికి క్రమం తప్పకుండా 5 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ, గత ఆరు నెలలుగా ఒడిశాలో తెలంగాణకు చెందిన తోలు ట్రక్కులను అన్యాయంగా నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాపారంపై దాదాపు 10,000 మంది జీవనం సాగిస్తున్నారని, లారీలను అడ్డుకోకుండా ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి స్వయంగా ఒడిశా సీఎంతో మాట్లాడి తోలు వ్యాపారుల లారీలను విడిపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎల్‌నినో కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికకు సీఎస్ ఆదేశం**

మరోవైపు, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తిన వర్షాభావం, కరువు పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అక్టోబర్ మాసాంతంలోగా ఎల్‌నినో ప్రభావం, పంట నష్టం, తాగు నీటి ఎద్దడి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని సంబంధిత శాఖలకు సీఎస్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## విపక్షాల నిరసనకు బీజేడీ మద్దతు

- **జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**
- **ఇండియా కూటమి చేపట్టిన మార్చ్‌లో బీజేడీ ఎంపీలు**
- **ఇండియా కూటమిలో భాగస్వామి కాకపోయినా మద్దతు**
- **మార్చ్‌లో పాల్గొన్న మానస్ మంగరాజ్, సులతా దేవ్**
- **నవీన్ పట్నాయక్ ఆదేశాలతోనే పాల్గొన్నాం: మంగరాజ్**
- **విపక్షాల మధ్య సమన్వయం అవసరం**
- **ఇండియా కూటమితో బీజేడీకి అధికారిక సంబంధం లేదు**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి చేపట్టిన నిరసనకు బిజూ జనతాదళ్ (బీజేడీ) మద్దతు తెలిపింది. న్యూఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద చేపట్టిన మార్చ్‌లో బీజేడీ ఎంపీలు కూడా పాల్గొన్నారు. బీజేడీ అధికారికంగా ఇండియా కూటమిలో భాగస్వామి కాదు. అయినప్పటికీ విపక్షాల నిరసనలో ఆ పార్టీ ఎంపీలు పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

బీజేడీ ఎంపీలు మానస్ మంగరాజ్, సులతా దేవ్ ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. పార్టీ అధినేత, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకే నిరసనలో పాల్గొన్నట్లు మంగరాజ్ తెలిపారు. బీజేడీ మద్దతుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. నవీన్ పట్నాయక్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. విపక్ష పార్టీల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. అయితే బీజేడీ ఇండియా కూటమిలో చేరలేదని ఎంపీ సులతా దేవ్ స్పష్టం చేశారు. తమ పార్టీ ఇండియా కూటమితోనూ, ఎన్డీయేతోనూ సమదూరం పాటిస్తోందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ కోసం మాత్రమే నిరసనలో పాల్గొంటున్నామని సులతా దేవ్ తెలిపారు. రాజకీయ కూటమిలో చేరడం దీనికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్

- **ఫ్లైదుబాయ్ ఘటనలో గాయపడిన పైలట్**
- **పైలట్‌పై కోపైలట్ గొడ్డలితో దాడి**
- **తల, వీపుపై తీవ్ర గాయాలు**
- **విపరీతంగా రక్తస్రావం**
- **సౌదీలో అత్యవసర శస్త్రచికిత్స**
- **యూఏఈ మిలిటరీ ఆసుపత్రికి తరలింపు**
- **శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు**
- **ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి స్థిరం**
- **భారత అధికారులు పరిస్థితిని పర్యవేక్షణ**
- **పైలట్‌ను కలిసిన కుటుంబసభ్యులు**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఫ్లైదుబాయ్ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని అధికారులు తెలిపారు. కోపైలట్ గొడ్డలితో దాడి చేయడంతో ఆయన తల, వీపు భాగంలో తీవ్ర గాయాలై భారీగా రక్తస్రావమైనట్లు పేర్కొన్నారు.

విమానం సౌదీలో ల్యాండ్ అయిన వెంటనే మచ్చర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం యూఏఈలోని మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

**శరీరంపై పలుచోట్ల గాయాలు**

కోపైలట్ దాడిలో మచ్చర్ కాళ్లు, చేతులు, ఛాతీ, పొత్తికడుపు పైభాగంతో పాటు శరీరంలోని పలుచోట్ల తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయని వెల్లడించారు.

**భారత అధికారులు పర్యవేక్షణ**

రియాద్, జెడ్డాలోని భారత అధికారులు కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తున్నారు. మచ్చర్‌ను కలిసేందుకు ఆయన కుటుంబసభ్యులను కూడా అనుమతించినట్లు అధికారులు తెలిపారు.



# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..
- ఢిల్లీలో విపక్షాల ఆందోళన
- ఇండియా కూటమి నేతల భారీ ర్యాలీ
- పార్లమెంట్ మకర ద్వారం నుంచి మార్చ్ ఈ
- ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీ
- 'సేవ్ డెమోక్రసీ' బ్యానర్లతో నిరసన
- ఆకాశవాణి భవన్ వద్ద పోలీసుల అడ్డుకట్ట
- రోడ్డుపై బైఠాయించిన రాహుల్, ఖర్గే, ప్రియాంక
- బారికేడ్లపైకి ఎక్కిన రాహుల్ గాంధీ
- జాతీయ జెండాతో నిరసన తెలిపిన కాంగ్రెస్ నేత

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో ఇండియా కూటమి నేతలు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు ర్యాలీ ప్రారంభించారు. 'సేవ్ డెమోక్రసీ' బ్యానర్లను ప్రదర్శిస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆకాశవాణి భవన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం రాహుల్ గాంధీ బారికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండా చేతపట్టుకొని నిరసన తెలిపారు.



**నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బస్సులో తరలించే ప్రయత్నం చేశారు. విపక్ష ఎంపీలను తరలిస్తున్న బస్సును పలువురు కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో నేతలను కొద్దిదూరం తీసుకెళ్లిన తర్వాత పోలీసులు బస్సు నుంచి బయటకు పంపించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఆకాశవాణి భవన్ వద్ద ఉన్నారు. ''జ్ఞానేశ్ ఇక చాలు.. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది'' అంటూ ర్యాలీకి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. నిరసనల్లో డీఎంకే, ఆమ్‌ఆద్మీ పార్టీ పాల్గొనలేదు.

# భద్రాద్రి ఆలయ పనులు వేగవంతం చేయాలి

**భద్రాచలం టౌన్, అక్టోబరు 6 (డీడీ9 వార్త)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన నమూనా, మ్యాపింగ్, బడ్జెట్, పనుల పూర్తికి గడువును ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. యాదాద్రి తర్వాత రాష్ట్రంలో కీలకమైన భద్రాద్రి ఆలయ పనులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా భద్రాచలం అభివృద్ధి ఇలా ఉండటం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సంబంధిత శాఖలు, కాంట్రాక్టర్లు, మంత్రులు పనులపై పూర్తి బాధ్యత వహించాలని కోరారు.

అంతకుముందు మార్నింగ్ వాకింగ్‌లో ఆలయ పరిసరాలను పరిశీలించిన రవీందర్ డ్రైనేజీ, పారిశుద్ధ్య పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంపై జిల్లా పంచాయతీ అధికారులు వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.




# 45 ఎకరాలు ఏమయ్యాయి?

- ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో 45 ఎకరాల మిస్సింగ్
- కేసీఆర్ కుటుంబానికి రెవెన్యూ రికార్డులపై నోటీసులు
- అర్హులైన పేద రైతులకు భూముల పంపిణీకి నిర్ణయం
- అమరవీరుల కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, దాని శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం 388 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, ఇటీవల అధికారులు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. ఈ సర్వే నంబర్‌లో మిస్సయిన 45 ఎకరాల భూమి ఎక్కడికి పోయిందో తక్షణమే తేల్చాలని అధికారులను సీఎం ఆదేశించారు. ల్యాండ్ రికార్డులను పక్కాగా సరిచూసి భూమిని గుర్తించడం కోసం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**కేసీఆర్ కుటుంబానికి నోటీసులు..**

**అర్హులైన రైతులకు భూముల పంపిణీ**

మిస్సయిన భూమి సరిహద్దుల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) తో పాటు ఆయన కుటుంబ సభ్యుల భూములు ఉన్నందున, వారికి సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలని కోరుతూ నోటీసులు జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. రికార్డులు పరిశీలించి, భూ సరిహద్దులను లెక్క తేల్చనున్నారు. కాగా, సర్వే నంబర్ 325 పరిధిలో గుర్తింపు పొందే సరిహద్దు భూమిని స్థానికంగా ఉన్న అర్హులైన పేద రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.





**తెలంగాణ అమరవీరుల కాలనీగా నిర్మాణం..**

**హౌసింగ్ బోర్డుకు బాధ్యతలు**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాల కోసం అదే సర్వే నంబర్ 325లో 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కాలనీలో అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను కేటాయించడంతో పాటు, సకల మౌలిక వసతులతో సమగ్ర రూపురేఖలు దిద్దాలని సూచించారు. ఈ కాలనీ నిర్మాణ బాధ్యతలను తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ఆదేశించిన సీఎం, వచ్చే జూన్ 2వ తేదీ (తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం) నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టమైన గడువు విధించారు.

# మైలారం గ్రామంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం

- అంగన్వాడీ టీచర్లను సన్మానించిన చందుపట్ల కీర్తి రెడ్డి

**శాయంపేట,అక్టోబర్ 06, డి డి 9వార్త**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ శాయంపేట మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడునూతుల నిశిధర్ రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తి రెడ్డి,జిల్లా ఇన్‌చార్జి ఆరుట్ల దశమంత రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారుల సంరక్షణ,పోషణ, ఆరోగ్యం,విద్యాభివృద్ధి కోసం అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వారి సేవలను గుర్తిస్తూ అంగన్వాడీ టీచర్లను ఆమె స్వయంగా సన్మానించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో ప్రజాసేవకు మరింత ప్రాధాన్యతనిస్తూ,రానున్న రోజుల్లో కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలిచి సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి,జిల్లా ఉపాధ్యక్షులు కోడెపాక స్వరూప,జిల్లా కౌన్సిల్ సభ్యులు కానుగుల నాగరాజ్,మంద సురేష్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్,కార్యదర్శి మేకుల సుమన్, పోలు మహేందర్,భూత్ అధ్యక్షులు వంగల భాస్కర్ రెడ్డి,మునుకుంట్ల చంద్రమౌళి,మూడేడ్ల పైడి, ముల్కనూరు వెంకటేష్,మంద మధు,పున్నం సాంబయ్య,కొంగరి సుధాకర్,బాసాని నవీన్,ఎర్ర రాకేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు, మైలారం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.









# ఆదివాసి భాషను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

- తెలంగాణ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దివ్య దేవరాజన్ పిలుపు
- భద్రాచలంలో ఘనంగా 12వ గోండి-కోయ నిఘంటువు వర్క్‌షాప్
- 10 రాష్ట్రాల ప్రతినిధుల భాగస్వామ్యం.. 15 వేల ప్రామాణిక పదాల సేకరణ

**భద్రాచలం, అక్టోబర్ 6 (డిడి9 వార్త)**

గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు మాతృభాష అయిన కోయ భాషను అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దివ్య దేవరాజన్ స్పష్టం చేశారు. మంగళవారం భద్రాచలం గిరిజన భవనంలో నిర్వహించిన 12వ గోండి కోయ నిఘంటువు భాషా ప్రామాణిక వర్క్‌షాప్‌నకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలు తమ భాష పట్ల మక్కువ పెంచుకోవాలని, పిల్లలకు చదువుతో పాటు మాతృభాష ప్రాముఖ్యతను నేర్పించాలని కోరారు. పది రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన ప్రతినిధులు ఐదు రోజులుగా శ్రమించి 15 వేల భాషా ప్రామాణిక పదాలను సేకరించడం అభినందనీయమన్నారు. కోయ భాషకు లిపి లేకపోయినా.. డిక్షనరీ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున, మంత్రి సీతక్క సహకారంతో తనవంతు పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆదివాసి మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి, చిన్నారుల రేలా నృత్యాన్ని తిలకించారు.

**కోయ భాషను ముందుకు తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రాంతాలను బట్టి యాస మారినా ఆదివాసీల సంస్కృతి ఒకే విధంగా ఉంటుందని తెలిపారు. నేటితరం యువత కోయ భాషను ముందుకు తీసుకెళ్లాలని, డిక్షనరీ ముద్రణకు సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని వెల్లడించారు.

**జీపీఎస్ పాఠశాలల్లో మాతృభాషకు ప్రాధాన్యత: ఐటీడీఏ పీవో రాహుల్**

ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ.. గిరిజన చిన్నారులకు తెలుగుతో పాటు వారి మాతృభాషపై మక్కువ కలిగేలా జీపీఎస్ పాఠశాలల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో వివాహ పత్రికలు, ప్రశంస పత్రాలను సైతం కోయ భాషలోనే ముద్రిస్తున్నామని పేర్కొన్నారు. భూమిపై గిరిజన ప్రజలు ఉన్నంతవరకు కోయ భాష మరుగన పడకుండా ఐటీడీఏ సహకారంతో డిక్షనరీని ముద్రిస్తామని చెప్పారు.

కార్యక్రమం అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, డీఆర్‌డీఏ విద్యా చందన, డీపీవో అనూష, సర్పంచ్ పునేం కృష్ణదొర, కన్వీనర్ నెహ్రూ, రిటైర్డ్ ఏసీఎంవో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.





# తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న

- జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్

**జవహర్ నగర్, సెప్టెంబర్ 6,(డీడీ9 వార్త):**

భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న అని జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. మంగళవారం వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా చెన్నాపురంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్రం కోసం బ్రిటిష్ మూకలతో ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. చంద్రపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, వడ్డర వెంకటేష్,డిఎస్ఎస్ వెంకటేష్,గజ్వెల్ శంకర్,వీర్ల బుజంగం,విజయరాయ్, మల్లేశం,రాము,రాజు యాదవ్,బిట్టు ,వడ్డర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగులకు అండగా ప్రజా ప్రభుత్వం

- మైలారం ఉపసర్పంచ్ మస్కే కుమారస్వామి

**శాయంపేట,అక్టోబర్ 06,డి డి 9వార్త**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వికలాంగులకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని మైలారం ఉపసర్పంచ్ మస్కే కుమారస్వామి అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన వికలాంగుడు బొంతల రవికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంజూరు చేయించిన బ్యాటరీ ట్రై సైకిల్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ వికలాంగులు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.వికలాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలు, సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెండెల సదయ్య,పల్లెబోయిన రాజు,కాంగ్రెస్ నాయకులు మామిడిపల్లి సాంబయ్య,అరికెళ్ల సుధాకర్, వెంకటేశ్వర్లు,శ్రీరాముల అనిల్, కళ్యాణ్,జక్కుల అఖిల్,మసికే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# ములుగు మున్సిపాలిటీలో దసరా పేరిట రూ. 11 లక్షల గోల్ మాల్..?

- **చీకటి ఒప్పందాలపై 7వ వార్డు కౌన్సిలర్ బైకాని సునీత ఓదెలు సంచలన ఆరోపణలు.**

**ములుగు అక్టోబర్ 06;**




ములుగు మున్సిపాలిటీలో చైర్మన్, కమిషనర్ల తీరుపై 7వ వార్డు కౌన్సిలర్ బైకాని సునీత ఓదెలు సంచలన ఆరోపణలు చేశారు.
మున్సిపల్ నిబంధనల ప్రకారం లక్ష దాటితే టెండర్ పిలవాల్సి ఉండగా, ఎలాంటి కౌన్సిల్ తీర్మానం లేకుండా దసరా ఖర్చుల పేరుతో రూ. 11 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు చైర్మన్, కమిషనర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మిగతా 19 మంది కౌన్సిలర్లకు తెలియకుండా నర్సంపేట వారితో చీకటి ఒప్పందం చేసుకుని కమిషన్ల కోసం తోపుకుంట కట్ట మీద 15 రోజులుగా ఎవరికీ తెలియకుండా ఆర్చ్ గేటు కట్టిస్తున్నారని విమర్శించారు.
పాలకవర్గం ఏర్పడినప్పటి నుండి వీధి దీపాలకు లైట్లు, క్లాంపులు అడిగినా ఇవ్వని అధికారులు, దసరా పేరిట లక్షలు తరలించడం దారుణమన్నారు.
7వ వార్డు మాధవరావుపల్లిలో తీవ్ర నీటి సమస్య ఉందని, బోరు వేయాలని ప్రతి కౌన్సిల్ మీటింగ్ లో మొత్తుకుంటున్నా స్పందించడం లేదని, మున్సిపల్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వాయిదా వేస్తున్న చైర్మన్, కమిషనర్లకు ఈ లక్షలు ఎక్కడి నుండి వస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. 15 వేలు ఉన్న కమర్షియల్ టాక్స్ ను లక్ష, రూ 3 వేలు ఉన్న పేదల ఇంటి పన్నును రూ. 30 వేలు వేయడం కూడా ఈ దోపిడీ కోసమేనా అని ప్రశ్నించారు. ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ములుగు మున్సిపాలిటీలో జరిగే గందరగోళాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బీజేపీ సన్నాహక సమావేశం

- **ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు**
- **తాడ్వాయి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం**
- **బీజేపీ తాడ్వాయి మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది**
- **సమావేశానికి ములుగు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు మేడిశెట్టి ఓమ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.**

**తాడ్వాయి డిడి9 వార్త**

తాడ్వాయి మండలంలో ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ప్రతి కార్యకర్త తమ పరిధిలోని పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటు నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. అధిక సంఖ్యలో అర్హులైన పట్టభద్రుల ఓట్లు నమోదయ్యేలా నిరంతరం కృషి చేయాలని సూచించారు.
ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు సిద్ధబోయిన సురేందర్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ ద్యాగాలా సాలెందర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు మాదరి శ్రీకాంత్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హనుమంత రెడ్డి గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పూణే భాస్కర్ మాజీ మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు ఓ బి సి మండల అధ్యక్షుడు ఎరుకల శ్రీను కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వర్ధిల్లు వెంకన్న మండల ప్రధాన కార్యదర్శి మోరే నాగేష్ బూత్ అధ్యక్షులు ధనసరి దిలీప్ చెవు గాని రఘుబాబు మండల నాయకులు కోర్నెబెల్లి సేనాపతి వల్లపు సాయికుమార్ , మండల పదాధికారులు, కార్యకర్తలు పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణపై చర్చించారు.



# గిరిజన మహిళలకు అక్షరజ్ఞానం అందించాలి

- **ఉల్లాస్ , టాస్ ద్వారా విద్యాబోధన**
- **ఐటీడీఏ పీఓ బి. రాహుల్**

**భద్రాచలం టౌన్ , అక్టోబరు 6 (డీడీ9 వార్త)**

మారుమూల గిరిజన గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మధ్యలో చదువు మానివేసిన మహిళలను గుర్తించి వయోజన విద్య ద్వారా అక్షరజ్ఞానం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్ , తెలంగాణ ఓపెన్ స్కూల్ కార్యక్రమాల ద్వారా వారికి విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఉల్లాస్ , టాస్ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ డీఆర్ డీఏ, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారంతో జిల్లాలోని మారుమూల గ్రామాల్లో చదువు మధ్యలో నిలిపివేసిన మహిళలను గతంలో గుర్తించి, చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యను అందించినట్లు తెలిపారు. వారికి పరీక్షలు నిర్వహించి మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఏడో తరగతి వరకు చదివి విద్యను నిలిపివేసిన మహిళలతో పాటు పదో తరగతి పూర్తిచేసి ఇంటర్మీడియట్ చదవలేకపోయిన వారు, ఇతర డ్రాప్ అవుట్ లను గుర్తించి ఉల్లాస్ , టాస్ కార్యక్రమాల ద్వారా నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తామని తెలిపారు. దసరా సెలవుల్లో ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు తమ ఇళ్లకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో పాటు పరిసర గ్రామాల్లోని నిరక్షరాస్య మహిళల వివరాలను సేకరించేలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా కూడా అర్హులైన మహిళలను గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్ చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

- **జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..**
- **ఢిల్లీలో విపక్షాల ఆందోళన**
- **ఇండియా కూటమి నేతల భారీ ర్యాలీ**
- **పార్లమెంట్ మకర ద్వారం నుంచి మార్చ్ ఈ**
- **ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీ**
- **'సేవ్ డెమోక్రసీ' బ్యానర్లతో నిరసన**
- **ఆకాశవాణి భవన్ వద్ద పోలీసుల అడ్డుకట్ట**
- **రోడ్డుపై బైఠాయించిన రాహుల్, ఖర్గే, ప్రియాంక**
- **బారికేడ్లపైకి ఎక్కిన రాహుల్ గాంధీ**
- **జాతీయ జెండాతో నిరసన తెలిపిన కాంగ్రెస్ నేత**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి నేతలు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు ర్యాలీ ప్రారంభించారు. 'సేవ్ డెమోక్రసీ' బ్యానర్లను ప్రదర్శిస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆకాశవాణి భవన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం రాహుల్ గాంధీ బారికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండా చేతపట్టుకొని నిరసన తెలిపారు.



**నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహ పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బస్సులో తరలించే ప్రయత్నం చేశారు. విపక్ష ఎంపీలను తరలిస్తున్న బస్సును పలువురు కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో నేతలను కొద్దిదూరం తీసుకెళ్లిన తర్వాత పోలీసులు బస్సు నుంచి బయటకు పంపించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఆకాశవాణి భవన్ వద్ద ఉన్నారు. ''జ్ఞానేశ్ ఇక చాలు.. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది'' అంటూ ర్యాలీకి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. నిరసనల్లో డీఎంకే, ఆమ్ఆద్మీ పార్టీ పాల్గొనలేదు.

# విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- **అర్హులైన పేదలందరికీ పెన్షన్లు ఇవ్వాలి**
- **నిత్యావసర ధరలు కట్టడి చేయాలి**
- **ఇసుక లారీల బెడద నుంచి భద్రాచలాన్ని కాపాడాలి**
- **1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**
- **సబ్ కలెక్టర్‌కు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ వినతి**

**భద్రాచలం , అక్టోబరు 6 (డిడి9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, అర్హులైన పేదలందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు మరింత భారాన్ని మోపుతుందని అన్నారు. చార్జీల పెంపును ఉపసంహరించుకునే వరకు ప్రజలతో కలిసి పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.
రాష్ట్రంలో అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు అందని వారిని వెంటనే గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు బియ్యం, పప్పులు, ఉప్పు తదితర నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

**- ఇసుక లారీలతో ప్రజలకు ఇబ్బందులు**

భద్రాచలం నియోజకవర్గంలో ఇసుక లారీల రాకపోకలు రోజురోజుకూ పెరుగుతున్నాయని రంగారెడ్డి ఆరోపించారు. ఇసుక రవాణాతో పలు రహదారులు దెబ్బతిన్నాయని, గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు, అత్యవసర వైద్యం అవసరమైన వారు ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చర్ల నుంచి భద్రాచలం వరకు రాకపోకలకు అధిక సమయం పడుతోందని తెలిపారు.
ఇసుక ర్యాంపుల నిర్వహణను క్రమబద్ధీకరించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా ఇసుక రవాణాపై ప్రభుత్వం సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.

**1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందని రంగారెడ్డి అన్నారు. ముఖ్యంగా 1/70 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు.







కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కల్పన, ఆర్.మధుసూదన్‌రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు దాసరి సాయన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివప్రశాంత్, పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు మునిగెల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# టైర్ గుర్తుకు ఓటు వేసి టి ఎన్ టి యూ సి, ని గెలిపించండి.

- **తెలుగుదేశం అనుబంధ టి ఎన్ టి యూ సి, ప్రచార జోరు.**

**డిడి9వార్త / రామగుండం అక్టోబర్ 7:**

ఈరోజు రామగుండం ఆర్టీసీ తేది 9 10 2026 ఎలక్షన్లు సందర్భంగా ఆర్టీసీ కండక్టర్లకు ఆర్టీసీ డిపోలో పనిచేసినటువంటి ప్రతి ఒక్క కార్మికునికి టిఎన్టియూసి, పక్షాన టైర్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు టిఎన్టియూసి,ని గెలిపిస్తారని తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ అయినటువంటి టి ఎన్ టి యూ సి,కోరుకుంటుంది అదేవిధంగా కార్మికులకు ఆనాడు డాక్టర్ నందమూరి తారక రామారావు స్థాపించినటువంటి తెలుగుదేశం పార్టీ దానికి అనుబంధ సంస్థ అయినటువంటి టి ఏన్ టి యూ సి,పక్షాన కార్మికులందరూ కూడా ఏన్నో ఉపయోగాలు జరిగాయి అదే విధంగా నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆనాడు నందమూరి హరికృష్ణ రావణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు ఆ సమయంలోనే కండక్టర్లుగా మహిళల కు ఉద్యోగాలు కల్పించినటువంటి ఘనత తెలుగుదేశం పార్టీది అదేవిధంగా ఆనాడు తెలుగుదేశం పార్టీ 96 99లలో ఎంతోమంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించిన అటువంటి గొప్ప నాయకుడు నారా చంద్రబాబునాయుడు అదేవిధంగా ఆనాడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాకి ఒక బస్సు కాంప్లెక్స్ కట్టి నా ఘనత ఆనాడు తెలుగుదేశం పార్టీ సాధించినటువంటి గొప్ప అంశం అదే విధంగా నందమూరి హరికృష్ణ ప్రతి జిల్లాలలో డిపోలు పెంచి దాంట్లో ఉద్యోగాల అవకాశాలు కల్పించినటువంటి ఘనత హరికృష్ణది అదే మాదిరిగా నారా చంద్రబాబు ఆశయాలతో ఆశీస్సులతో జిల్లాలలో ఈ యొక్క టిఎన్టియుసిని టైర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించేది ఉంటే రాబోవు రోజుల్లో మరి ఎంతోమంది కాంటాక్ట్ కార్మికులకు ఇప్పుడున్నటువంటి డ్రైవర్లకు కండక్టర్లకు మెకానికులకు ఆర్టీసీలో పనిచేసే ప్రతి ఒక్కరు కు ప్రభుత్వాలతో మాట్లాడి వారికి రావాల్సినటువంటి అన్ని సదుపాయాలు సమకూర్చి పెడతామని టిఎన్టిసి పక్షాన తెలియజేస్తున్నాం టిఎన్టియుసి గుర్తు టైర్ గుర్తు గుర్తుంచుకొని ఓటు వేసి ఆశీర్వదిస్తారని తెలియజేస్తూ ఉన్నాము.ఇట్లు కె నిమ్మకాయ ఏడు కొండలు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మాజీ కార్యదర్శి సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముందుగంటి దామోదర్ రెడ్డి పెద్దపల్లి పార్లమెంటు అధ్యక్షుడు, పెగడపల్లి రాజనర్సు టిఎన్టియుసి కోశాధికారి,కొండి శ్రీనివాస్ పెద్దపల్లి పార్లమెంట్ ప్రచార కార్యదర్శి కామెరా రాజబాబు తెలుగుదేశం పార్టీ మాజీ రామగుండం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు, బెక్కం వీరేందర్ టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, సుందిళ్ల స్వామి టౌన్ ఎస్సీ సెల్ మాజీ కార్యదర్శి రామగిరి రాజేశ్వరి ఎస్ఎస్ఎల్ మాజీ కార్యదర్శి, ఇందారపు రాజబాబు తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

**భద్రాచలం టౌన్ , అక్టోబరు 6 ( డీడీ9 వార్త )**




భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ , రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం తహసీల్దార్ కె. రవికుమార్ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఓటు హక్కుపై అవగాహన పెంచుకుని, ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ హిమజ, ఎన్ ఎస్ ఎస్ పీఓలు డాక్టర్ కిరణ్ కుమార్ , బి. సుధాకర్ రావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వీరస్వామి, ఇతర అధ్యాపకులు, భద్రాచలం రెవెన్యూ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజనులకు సంక్షేమ పథకాలతోపాటు ఆర్థిక చేయూత

- **గిరిజన విద్యార్థుల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు**
- **ఐటీడీఏ పీవో బి. రాహుల్**

**భద్రాచలం టౌన్ , అక్టోబరు 6 (డీడీ9 వార్త)**



మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలతో పాటు గిరిజన మహిళలు, రైతులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.
మంగళవారం తన ఛాంబర్ లో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్ మెంట్ బృందం సభ్యులు రాహుల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ శాఖల కార్యక్రమాలు, జీసీసీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను పీవో వివరించారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న పోషకాహార ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు భద్రగిరి మార్ట్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంఎస్ ఎంఈ గ్రూపుల మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీ, చాక్లెట్లు, ఇప్పనూనెతోపాటు అటవీ, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నామని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కోసం పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాహుల్ తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్దీపకం వర్క్ బుక్ 1, 2, 3లను ప్రవేశపెట్టడంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, పాఠశాలల హాజరు శాతం మెరుగుపడిందన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదివిన విద్యార్థుల్లో 15 మంది ఐఐటీకి, 25 మంది నీట్ కు, 8 మంది ఎంబీబీఎస్ కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. వారికి అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం జీసీసీ రామానందం, ఫారెస్ట్ పాల్వంచ డివిజన్ మేనేజర్లు మాధవి, విజయకుమారి, ప్లాంట్ మేనేజర్లు సురేష్ కుమార్ , లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, జీసీసీ మేనేజర్లు జయరాజ్ , సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి రిపేర్లకు 'రిపేర్‌మిత్ర'

- **బీటెక్ విద్యార్థిని స్వాతి ఓదెల వినూత్న ఆలోచన**

**జనగామ అక్టోబర్ 6(డిడి9వార్త)బ్యూరో**



జనగామ జిల్లా పరిధిలో ఇంట్లో ఏసీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టీవీ, ఫ్రిజ్ తదితర రిపేర్ సమస్యలకు నమ్మకమైన సేవలు అందించేందుకు వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థిని స్వాతి ఓదెల 'రిపేర్‌మిత్ర' డిజిటల్ హోమ్ సర్వీస్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. డా. కె. శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ వేదిక ద్వారా వివిధ గృహ సేవలను ఒకే చోట ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

కస్టమర్ నుంచి సర్వీస్ రిక్వెస్ట్ అందిన తర్వాత సంబంధిత టెక్నీషియన్ ఇంటికి వెళ్లి సమస్యను పరిశీలించి అంచనా వ్యయాన్ని తెలియజేస్తారు. స్థానిక టెక్నీషియన్లు సర్వీస్ పార్ట్‌నర్లుగా నమోదు చేసుకుని కొత్త అవకాశాలు పొందేలా ఈ వేదికను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగా సేవలు అందిస్తూ, భవిష్యత్తులో ఇతర నగరాలకు విస్తరించడమే లక్ష్యమని స్వాతి తెలిపారు.

# కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చిన్న పాప కు నైనిష ఫౌండేషన్ ఆర్థిక సాయం.

**మణుగూరు. అక్టోబర్ 6 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలం లోని మద్దులగూడెం వెళ్లే రోడ్డు వద్ద ఉన్న డబల్ బెడ్ రూమ్ లో నివాసం ఉంటున్న M .అశోక్ కు ముగ్గురు సంతానం ఇద్దరు కుమారులు, ఒక పాప. M రిద్వికి అనే పాప కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. కిడ్నీ సమస్య వ్యాధితో చికిత్స పొందుతుంది ఎం. అశోక్ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇబ్బందుల్లో ఉండటంతో.. పాపను హాస్పిటల్ చూపించే స్తోమత లేక నైనీష ఫౌండేషన్ వారిని సంప్రదించారు. అతని దయనీయ పరిస్థితిని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం M. రిద్వికి D/o అశోక్ కి. రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైనిష ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫౌండర్ మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పోదిల వీరబాబు, అడ్వకేట్.& లీగల్ అడ్వైజర్. ఈర్ల రాము, జర్నలిస్ట్ మిట్టపల్లి గోపి, అడ్వకేట్ నాగార్జున రెడ్డి. మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జనగామకు విద్యాసంస్థలు మంజూరు చేయాలి

- **సీఎం ముఖ్య సలహాదారు రామకృష్ణారావుకు నాగరత్న సేవా సంఘం వినతి**

**జనగామ6 అక్టోబర్ (డిడి 9వార్త) బ్యూరో**



నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, కాకతీయ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బీర్రు ఇస్తారి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు రామకృష్ణారావును కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.

జనగామలో విద్యాసంస్థల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, భవనాలు, 15 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తే జనగామ విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గతంలో జనగామకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరుకు సహకరించిన రామకృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాకతీయ ఇంజినీరింగ్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ మంజూరుకు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జాతీయ పురస్కారంతో ఏజెన్సీకి గర్వకారణం..

- **చంద్రకళకు ఎస్ఐ తిరుపతి ఘన సత్కారం..**

**అక్టోబర్ 06 డిడి9 వార్త వెంకటాపురం.**

జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ ఛాయాచిత్రగ్రహీత చంద్రకళ సదాశివ ప్రసాద్‌ను వెంకటాపురం ఎస్ఐ తిరుపతి ఆత్మీయంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా నాగార్జున యూనివర్సిటీలో "జై జవాన్ - జై కిసాన్" నినాద స్ఫూర్తితో చంద్రకళ రూపొందించిన ఛాయాచిత్రానికి లభించిన "భారతీయ వారసత్వం & దేశభక్తి పురస్కారం" గురించి ఎస్ఐ తిరుపతి ఆసక్తిగా తెలుసుకున్నారు. దేశభక్తిని, గ్రామీణ జీవన స్ఫూర్తిని ప్రతిబింబించేలా రూపొందించిన ఛాయాచిత్రాన్ని ఆయన అభినందించారు. గత 30 ఏళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను తన ఛాయాచిత్రాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్న చంద్రకళ సేవలను ఎస్ఐ తిరుపతి ప్రశంసించారు. అనంతరం జాతీయ స్థాయి ఛాయాచిత్రంలో దేశభక్తిని చాటిన రైతు కొప్పుల కృష్ణను కూడా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మహేష్, వంకాయల రాము, వేల్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




# బయ్యక్క పేట ఆశ్రమం సం దర్శించిన ఐటీడీఏ పీఓ..!!





- **తరగతి గదులు పరశీలన,**
- **శుభ్రత,పరిశుభ్రతపై సూచనలు,,**
- **విద్యాబోద ,మెరుగు పడాలె,పౌషిటికాహారంపై శ్రద్ధ,,,**
- **తాగునీరు, ఆరోగ్యం,స్వచ్ఛభారత్ చూడాలని,,,**
- **సమస్యలు ఉంటె చెప్పమనిఆదేశాలు,,**
- **విద్యార్థుల ప్రగతె లక్షంగ పని చేస్తెనె మంచి గుర్తింపు,,**

**ఏటూరునాగారం క్రైం,, డి డి 9 వార్త,,అక్టో,06,**

ఎటూరునాగారం ఐ టి డి ఏ ద్వార నడుస్తున్న బయ్యక్క పేటలోని గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాల (AUPS)ను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంద ర్శించెను, పాఠశాలలో ని విద్యా పరిస్థితులు, విద్యా ర్థులకు అందుతున్న పౌష్టిక ఆహర సౌకర్యాలను పరిశీ లించారు.ఈ సందర్భంగా పీఓ తరగతి గదులను సందర్శించెను,విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నోట్ బుక్స్, అభ్యసన స్థా యి, విద్యా ప్రగతిని పరిశీ లించారు, పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థు లు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయె విధం గ ,నిర్వహకులు చూడాలని చూసించెను,చదువుకునె విధంగ శ్రద్ధ,పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అలాగే పాఠశాలలోని ఫ్యూటర్ ల్యాబ్, డార్మిటరీ తదితర సౌకర్యాలను పరిశీ లించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాల నిర్వ హకులు చర్యలుతీసుకోవా లనిసూచించారు,విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరు మరియు పాఠశాల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని పీఓ సూచిం చారు. విద్యార్థులకు నాణ్య మైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలి..

- **బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ పిలుపు.**

**మణుగూరు. అక్టోబర్ 6 (డి డి 9వార్త)**

రాష్ట్ర పాలనా వ్యవస్థలో శాసనమండలి (పెద్దల సభ) అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుని, ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కరకగూడెం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రజల సమస్యలను చట్టసభల దృష్టికి తీసుకెళ్లే సరైన ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటర్ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు.

శాసనమండలి అనేది వివిధ రంగాల్లో అనుభవం, పరిజ్ఞానం కలిగిన ప్రతినిధులు తమ అభిప్రాయాలను చట్టసభలో వ్యక్తం చేసే వేదికగా నిలుస్తుంది. ముఖ్యంగా విద్య, ఉపాధి, నిరుద్యోగం, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల అభివృద్ధి, పారిశ్రామిక అవకాశాలు వంటి అంశాలపై పట్టభద్రుల తరపున సమర్థవంతంగా గళం విప్పేందుకు ఈ ఎమ్మెల్సీ స్థానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పట్టభద్రుల సమస్యలు సమాజం మరియు రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి కాబట్టి, అర్హులైన విద్యావంతులందరూ ఓటరు నమోదు కోసం అవసరమైన పత్రాలతో 06/11/2026 లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆన్‌లైన్ నమోదు విధానం:

తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అధికారిక వెబ్‌సైట్ (CEO Telangana) ను సందర్శించి, MLC Graduates Form18 ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా మీ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చు.

"పట్టభద్రుల ఓటు - ప్రజాస్వామ్యానికి బలం. మన ఓటు ద్వారా మన సమస్యలకు చట్టసభలో స్వరం కల్పిద్దాం."

రాబోయే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, అభ్యర్థుల సమర్థతను, నిబద్ధతను సరిగ్గా పరిశీలించి తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రతినిధి శ్రీరామచంద్రయ్య గారు, పార్టీ నాయకులు పూణెం శంకరయ్య, పోలబోయిన కృష్ణ, జాడి సమ్మయ్య, నందిగామ ప్రసాద్ చారి, బొల్లికొండ రవి కిరణ్ గొగ్గల శ్రీను, సత్యం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

- **యం ఎల్ సి ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చెయ్యాలి**
- **బిజెపి నాయకులు పల్ల బుచ్చయ్య**

**కన్నాయిగూడెం/అక్టోబర్ 6(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల వైస్ ప్రెసిడెంట్ బొగ్గుల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా బుచ్చయ్య హాజరయ్యారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సమాయత్తం కావాలని బీజేపీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవి. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టభద్రులను, నిరుద్యోగులను మోసం చేశాయి. కేవలం బీజేపీ మాత్రమే పట్టభద్రుల సమస్యలపై పోరాడుతోంది. ప్రతి గ్రామంలో ఉన్న పట్టభద్రులను గుర్తించి, వారికి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించాలి. ప్రతి బూత్ నుండి 50 ఓట్లు నమోదు చేయించే లక్ష్యంగా పెట్టుకోవాలి" అని అన్నారు.ఓటు నమోదు ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా మండల నాయకత్వాన్ని సంప్రదించాలి. నవంబర్ 6 వరకు ఓటు నమోదు గడువు ఉంది. కాబట్టి కార్యకర్తలందరూ ఇంటింటికీ తిరిగి ఓట్లు నమోదు చేయించాలి" అని దిశా నిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ,మండల ప్రధాన కార్యదర్శుల ఆకుతోట మధుకర్, ఓబీసీ జిల్లా నాయకులు తునికి శంకరా చారీ, పాపక శ్రీనివాస్, యువ మోర్చా మండల అధ్యక్షులు కుందారపు నాగరాజు,గ్రామ బాత్ అధ్యక్షులు ఆకుతోట దుర్గాప్రసాద్ , అనుకరి సత్యం మహిళా మోర్చా గ్రామ అధ్యక్షులు మారగోని మౌనిక సంతోష్, చిలకమరి సత్యం మరియు తదితరులు నాయకులు పాల్గొన్నారు.






# సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ ప్రకటించాలి..

- **జి యం కార్యాలయం ముందు టిబిజీకేఎస్ ధర్నా.**

**మణుగూరు. అక్టోబర్ 6 (డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కార్మికులు ప్రాణాలకు తెగించి రేయింబవళ్లు శ్రమించి సాధించిన వాస్తవ లాభాలను తక్షణమే ప్రకటించి, ఆ లాభాల్లో నుంచి కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల బోనస్‌ను వెంటనే ప్రకటించి, కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఏరియా టిబిజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో కార్మికుల కష్టార్జిత శ్రమతో వచ్చిన వాస్తవ లాభాలను ఎలాంటి తగ్గింపులు, మినహాయింపులు లేకుండా పారదర్శకంగా ప్రకటించాలని కోరారు. సాధించిన వాస్తవ లాభాల ఆధారంగా కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటాను త్వరితగతిన ప్రకటించి, నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి అభివృద్ధిలో కార్మికుల శ్రమ కీలకమని, ఎండా వానా, పగలు రాత్రి అనే తేడా లేకుండా ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి కోసం పనిచేసే కార్మికులకు వారి శ్రమకు తగిన న్యాయమైన లాభాల వాటా అందించాల్సిన అవసరం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై సింగరేణి యాజమాన్యం పై ఉందన్నారు.

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి దిశానిర్దేశం మేరకు మణుగూరు ఏరియాలో జీఎం కార్యాలయం ఎదుట ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాగెల్లి తెలిపారు.

"వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి - 36 శాతానికి పైగా లాభాల వాటాను తక్షణమే చెల్లించాలి." అంటూ కార్మికులు నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, జంగం రాజ్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్ మస్తాన్, దిశెట్టి రమేష్, చిరుత వెంకటేశ్వర్లు, బడే హరీష్,సర్వే నరేష్, అజ్మీరా అశోక్, ఇమ్రాన్, కటారి ప్రసాద్, తన్నీరు లింగయ్య, ఉప్పులేటి మురళి, హనీఫ్, సర్వేశ్, శ్రీను, నాగేశ్వర రావు, రాజేందర్, తిరుపతి, యోగి, శివ ప్రసన్న, బంగారి సురేష్, తోట తిరుపతి, మెదరి మహేష్, ఆపరేటర్ రమేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# సమ్మెకు పిలుపు

- **కూలిరేట్లు పెంచాలి టైలర్ కార్మికుల ఐక్య పోరాటం**
- **ది జనగామ పట్టణ టైలర్ వర్కర్స్ యూనియన్ –**

**జనగామ అక్టోబర్ 6( డిడి9) వార్త**

జనగామ పట్టణంలోని టైలర్ షాపుల యాజమాన్యాలకు తెలియజేయునది ఏమనగా...

టైలర్ కార్మికుల కూలిరేట్లను పెంచాలని కోరుతూ ఇప్పటికే యాజమాన్యాలకు లేఖ అందజేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు. దీంతో టైలర్ కార్మికులందరం సమావేశమై చర్చించి, కూలిరేట్లు పెంచే వరకు సమ్మె చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాము. కార్మికుల శ్రమకు తగిన న్యాయమైన కూలిరేట్లు అందించాలనే డిమాండ్‌తో ఈ నిర్ణయం తీసుకున్నాము. కావున జనగామ పట్టణంలోని టైలర్ కార్మికులందరూ ఐక్యంగా నిలిచి సమ్మె కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ పిలుపునిస్తోంది.

కూలిరేట్లు పెంచే వరకు పోరాటం కొనసాగుతుంది. టైలర్ కార్మికుల ఐక్యతే మన బలం - న్యాయమైన కూలిరేట్లు సాధించడమే మన లక్ష్యం.

**ఇట్లు**
**దేవసాని రాజేశ్వర్**
**అధ్యక్షుడు, ది జనగామ పట్టణ టైలర్ వర్కర్స్ యూనియన్**
**సెల్: 9849482001**



## బగ్గు మంటున్న బియ్యం ధరలు
# కుదేలవుతున్న సామాన్య ప్రజలు.

- **అధిక ధరలపై నియంత్రణ ఏది -- బ్లాక్ మార్కెటింగ్ పై చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి.**

**మణుగూరు. అక్టోబర్ 6 (డి డి 9వార్త)**

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా తయారైంది సామాన్యుల పరిస్థితి. ఇప్పటికే ఉప్పులు, పప్పులు, వంట నూనెల ధరలు ఆకాశాన్ని తాకుతుండగా.. ఇప్పుడు బియ్యం ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. ఓపెన్ మార్కెట్‌లో గత మూడు, నాలుగు నెలల్లోనే బియ్యం ధరలు భారీగా ఎగబాకాయి. నిన్న మొన్నటి వరకు కిలో బియ్యం రూ.4550 మధ్య ఉండగా.. ఇప్పుడు రూ.75 80 దాకా పెరిగాయి. తెలంగాణలో రికార్డు స్థాయిలో సన్నాల సాగు ఉన్నా బియ్యం ధరలు మాత్రం తగ్గేదేలే అంటూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అందుకు పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణలో పండే తెలంగాణ సోనా, HMT, BPT వంటి నాణ్యమైన సన్న రకాలకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. అక్కడి వ్యాపారులు నేరుగా తెలంగాణలోని నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లాలకు వచ్చి రైతుల వద్ద అధిక ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు తరలిస్తున్నారు. దీనివల్ల స్థానిక మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయి.

ఇక తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్ ప్రకటిస్తుండటం, పాఠశాలలు, రేషన్ షాపులకు సన్నబియ్యం సేకరిస్తుండటంతో రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఎక్కువ ఇస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ మిల్లర్లు, ఓపెన్ మార్కెట్ వ్యాపారులకు లభించే సన్న ధాన్యం కోటా తగ్గిపోయింది. రైతులకు గిట్టుబాటు ధర లభించడం సానుకూల పరిణామమే అయినా.. బహిరంగ మార్కెట్‌లో సన్న ధాన్యం క్వింటాలు ధర దాదాపు రూ3,200 నుండి రూ.3,300 పైచిలుకు పలుకుతోంది. దీనికి తోడు రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్, జీఎస్‌టి, విద్యుత్ ఛార్జీలు తోడవడంతో చివరకు వినియోగదారుడికి చేరేసరికి కిలో బియ్యం ధర రూ. 75 నుంచి రూ. 85 వరకు చేరుతోంది.

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కూడా బియ్యం ధరలపై పడిందని నిపుణులు చెబుతున్నారు. రానున్న పంట దిగుబడి కొంత తగ్గే అవకాశం ఉందన్న వార్తలతో హోల్‌సేల్ వ్యాపారులు, ప్యాకింగ్ కంపెనీలు సన్న బియ్యాన్ని ముందుగానే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి



నిల్వ చేసుకుంటున్నాయి. ఈ ముందస్తు కొనుగోళ్ల వల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడి ధరలు మరింత పెరిగాయి. ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ కింద సేకరించిన ధాన్యంలో కొన్ని మిల్లుల వద్ద అక్రమాలు జరగడం, నాణ్యమైన బియ్యం పక్కదారి పట్టడం కూడా లభ్యతను దెబ్బతీసింది.

మరోవైపు రైస్ మిల్లర్లు పాత అప్పుల బకాయిల విధానాన్ని పక్కనపెట్టి క్యాష్ అండ్ క్యారీ నిబంధన పెట్టడంతో రిటైలర్లు తమ లాభాల మార్జిన్‌ను పెంచి బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త పంట పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి రావడం, ప్రభుత్వం కృత్రిమ కొరత సృష్టించే నిల్వలపై తనిఖీలు చేపట్టడం ద్వారా మాత్రమే ధరలు తిరిగి అదుపులోకి వచ్చే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఊహించని ఈ నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ధరల పెరుగుదలను నియంత్రించాలని, బ్లాక్ మార్కెటింగ్ చేసే వ్యాపారస్తుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.





# లిరిక్స్ రాసి.. పాట పాడి.. సొంతంగా వీడియో చిత్రీకరణ

- **బహుముఖ ప్రతిభతో మెప్పిస్తున్న కొప్పుల గ్రామానికి చెందిన వర్ష**
- **సాంబశివ ఆలయంలో పాట షూటింగ్..**
- **ఆటపాటలతో సందడిగా మారిన కొప్పుల**

**శాయంపేట,అక్టోబర్ 06,డి డి 9వార్త**





తనలోని సృజనాత్మకతకు పదును పెట్టి,స్వయంగా లిరిక్స్ రాసి,ఆ పాటకు గాత్రం అందించి,అదే పాటను తన గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో చిత్రీకరించి ప్రతిభను చాటుకుంది హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన వర్ష.గందె కుమార స్వామి-సుహాసిని దంపతుల కుమార్తె అయిన వర్ష తనలోని బహుముఖ ప్రతిభతో గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది. మండలంలోని కొప్పుల గ్రామంలో వర్ష రూపొందించిన బతుకమ్మ పాట చిత్రీకరణ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. గ్రామంలోని శ్రీ సాంబశివ దేవాలయాన్ని నేపథ్యంగా ఎంచుకుని పాటను చిత్రీకరించడంతో కార్యక్రమానికి ప్రత్యేకత సంతరించుకుంది.తానే పాటకు సాహిత్యం అందించడం,తానే పాట పాడటం,చిత్రీకరణలోనూ చురుకుగా పాల్గొనడం వర్షలోని సృజనాత్మక ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.వర్ష పాట చిత్రీకరణ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమెకు ప్రోత్సాహం అందించారు. చిన్నారులు,మహిళలు,యువతతో పాటు గ్రామ పెద్దలు కూడా ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.దీంతో కొప్పుల గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. చదువుతో పాటు కళలపై ఆసక్తి పెంచుకుంటూ,తన ఆలోచనలను పాట రూపంలో వ్యక్తీకరించడం వర్ష ప్రత్యేకతగా నిలిచింది. సొంతంగా సాహిత్యం రాసి,దానికి స్వరం అందించి,తన ఊరి ప్రజలను భాగస్వాములను చేస్తూ పాటను రూపొందించడం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది.తమ కుమార్తె వర్షకు చిన్ననాటి నుంచే కళలపై ఉన్న ఆసక్తిని గుర్తించి తల్లిదండ్రులు గందె కుమార స్వామి,సుహాసిని ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.తల్లిదండ్రుల ప్రోత్సాహానికి తోడు గ్రామస్తుల సహకారం లభించడంతో వర్ష తన ప్రతిభను మరింతగా వెలికితీస్తోందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్నో ప్రతిభలు దాగి ఉన్నాయని, వారికి కుటుంబం,గ్రామస్తుల నుంచి ప్రోత్సాహం లభిస్తే ఉన్నత స్థాయికి ఎదగగలరని వర్ష నిరూపిస్తోంది.తన సొంత సృజనతో పాటను రూపొందించి గ్రామంలోనే చిత్రీకరించిన వర్షను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## పీఆర్సీ ప్రకటించి వెంటనే అమలు చేయాలి..ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**తూప్రాన్ ( డీడీ9 వార్త ) అక్టోబర్ 06**

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. తూప్రాన్ మండల కేంద్రంలోని తపస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని, జీఓ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ 190ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం, ప్రధాన కార్యదర్శి జాల సిద్ధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి రేఖా సుజాత, అర్చన, తూప్రాన్ మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా బాధ్యులు రాజు, మార్గం రాజు, తిరుణగారి నర్సింలు, వాసు, రాములు, నరేందర్, శివంపేట మండల ప్రధాన కార్యదర్శి జెట్టి మల్లేశం, చేగుంట మండల అధ్యక్షులు రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.

**వలిగొండ,అక్టోబర్ 6 (డీడీ9 వార్త):**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడంలో కేంద్ర ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా పారదర్శకంగా జాబితాలను రూపొందించాలని, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ అభ్యంతరాలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అఖిలపక్ష నాయకులు,ప్రజా సంఘాల ప్రతినిధులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## టూటౌన్ నూతన ఎస్ఐ నలివేలి లక్ష్మణ్ ను సన్మానించిన రాజేష్ యాదవ్ ,శ్రీకాంత్.

**డిడి9వార్త / రామగుండం అక్టోబర్ 7:**

సోమవారం రోజున గోదావరిఖని టూ టౌన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నలివేలి లక్ష్మణ్ ను రిపోర్టర్, టి పి టి ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.రాజేష్ యాదవ్ మాట్లాడుతూ టూ టౌన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికై ముందుండి పనిచేసి ప్రజల మెప్పు పొందాలని ఆకాంక్షించారు.అలాగే ఉన్నంత పదవులు అధిరోహించాలని మనస్పూర్తిగా కోరారు



## జనగామరోడ్లు, ఫుట్‌పాత్‌ల
# ఆక్రమణలకు ముగింపు

- **సంజయ్‌నగర్ మోడల్ మార్కెట్‌కు వీధి వ్యాపారుల తరలింపు**

**జనగామ అక్టోబర్ 6 (డిడి9) వార్త**



జనగామ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా, ట్రాఫిక్ ఇబ్బందులు లేని పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపాలిటీ కీలక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వీధి వ్యాపారాలను సంజయ్‌నగర్‌లో నిర్మించిన ఆధునిక మోడల్ మార్కెట్‌కు దశలవారీగా తరలించేందుకు చర్యలు ప్రారంభించింది.

**రూ.7 కోట్లతో ఆధునిక మోడల్ మార్కెట్**

సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన సంజయ్‌నగర్ మోడల్ మార్కెట్‌లో వ్యాపారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇందులో కూరగాయల మార్కెట్‌కు 50 షాపులు, నాన్‌వెజ్ మార్కెట్‌కు 65 షాపులు అందుబాటులో ఉన్నాయి. తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలతో పాటు ప్రజలకు, వ్యాపారులకు అనుకూలమైన మార్కెట్ వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.

**దరఖాస్తుల స్వీకరణ**

మోడల్ మార్కెట్‌లో షాపుల కేటాయింపునకు అర్హత కలిగిన వీధి వ్యాపారుల నుంచి 07102026 నుంచి 10102026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

అర్హత కలిగిన వీధి వ్యాపారులు నిర్ణీత గడువులోగా జనగామ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

**రోడ్లపై వ్యాపారాలకు స్వస్తి**

ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ ప్రాంతాల్లో వ్యాపారాల నిర్వహణ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు, పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని మున్సిపాలిటీ పేర్కొంది.

వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారికి క్రమబద్ధమైన, సురక్షితమైన మరియు మౌలిక సదుపాయాలతో కూడిన ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాన్ని కల్పించడమే మోడల్ మార్కెట్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని తెలిపింది.

"వ్యాపారుల జీవనోపాధికి రక్షణ ప్రజలకు మెరుగైన రాకపోకలు జనగామకు సుందర రూపం" అనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి వీధి వ్యాపారులు సహకరించాలని మున్సిపాలిటీ కోరింది.

**మున్సిపల్ కమిషనర్**
**జనగామ మున్సిపాలిటీ**

## ప్రభుత్వ ఆసుపత్రి లోనే ప్రసవాలు జరగేలా చుడాలని సూచన

**చర్ల, అక్టోబర్ 6 (డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)చర్ల ను అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సైదులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, సంస్థాగత ప్రసవాల ప్రాముఖ్యతను గర్భిణీలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును తప్పనిసరిగా ఫాలోఅప్ చేయాలన్నారు. ప్రతి అనుమానిత క్షయ కేసు నుండి కఫ పరీక్ష (స్పుటం టెస్ట్) కోసం నమూనాలను పంపించాలని, నమోదైన ప్రతి టీబీ కేసును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముప్పై సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ వంటి సంక్రమించని వ్యాధుల (నాన్ కమ్యూనికబుల్ డిసీసెస్) పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. అనంతరం పీహెచ్ సీ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పూజ హోమియోపతి మెడికల్ ఆఫీసర్, ఆర్ బీ ఎస్ కే డాక్టర్ స్ఫూర్తి, రామలక్ష్మి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, రామ్ ప్రసాద్ హెల్త్ సూపర్వైజర్, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## వడ్డే ఓబన్న కు ఘనంగా నివాళులు

జవహర్ నగర్ , సెప్టెంబర్ 6,(డీడీ9 వార్త) : స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ చెన్నాపురం లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు,





## రైతు కాడే లస్మన్న కుటుంబాన్ని పరామర్శ

- కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున అండగా ఉంటాం
- రైతులను కాపాడుకుంటాటం
- కేటీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు
- ప్రజా పాలన కాదు ప్రజల ప్రాణాలతో ఆడుకునే పాలన
- రైతు చనిపోతే కేసీఆర్ ప్రభుత్వం రైతు భీమా అందించింది
- కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఇష్టల్మెంట్ కూడా కట్టలేదు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

తలమడుగు మండల కేంద్రానికి చెందిన రైతు కాడే లస్మన్న పంట దిగుబడి రాదన్న దిగులుతో ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా వారి విషయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేటీఆర్ రైతు కుటుంబాన్ని కలిసి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించాలని సూచించారు. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రైతు కాడే లస్మన్న కుటుంబాన్ని పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని ఆధర్యపడొద్దని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు మరణాలు జరగకుండా ఉండేందుకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకం అమలుచేసి ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే రైతు కుటుంబానికి అండగా రూ. 5 లక్షల రైతుభీమ పథకం అమలుచేసి రైతు కుటుంబాలకు అండగా నిలబడ్డారన్నారు. మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సకాలంలో రైతుబంధు అందించకపోవడం, యూరియా కొరత వలన రైతులు మళ్ళీ తీవ్ర ఇబ్బందులు పడి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని మళ్ళీ 2 సంవత్సరాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని రైతులను కచ్చితంగా కాపాడుకుంటారని అన్నారు. ప్రభుత్వం రైతుభీమ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుధాకర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి : ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్06(డీడీ9 వార్త):**



భీమ్‌గల్‌లో పొలాస సుధాకర్ మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాల్కొండ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందడంపై అన్ని కోణాల్లో విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, సుధాకర్ చేసిన ఆరోపణలతో పాటు పోలీసుల వివరణలను పూర్తిస్థాయిలో పరిశీలించి నిజాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## పప్పు పంటలతో భూసారం పెంపు

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

దామన్ గూడ గ్రామంలో మిషన్ ఫర్ ఆత్మ నిర్భరత పథకం కింద పప్పు దినుసుల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కంది సాగు చేస్తున్న రైతులకు సస్యరక్షణ మందులు, పోషక ఎరువులను సర్పంచ్ మడావి ముకుంద్‌రావు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ కంది, పెసర, మినుములు, శనగ వంటి పంటలతో భూసారం పెరగడంతో పాటు తక్కువ నీటితో సాగు చేయవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా శనగ వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సబ్సిడీపై అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శృతి, ఉపసర్పంచ్ సెడెకి కృష్ణ, రైతులు పాల్గొన్నారు




## దసరాకు ఊరెళ్తున్నారా.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**




దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్లే నివాసితులు దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరిగే ఆస్కారం ఉన్నందున ప్రజలు పోలీసులతో పాటు ఇరుగు పొరుగు వారి సహకారం తీసుకోవాలని కోరారు. ప్రయాణానికి ముందే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడానికి వీలవుతుందని తెలిపారు. బంగారం, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని హెచ్చరించారు. ప్రయాణంలో ఉన్నప్పుడు 'ట్రావెలింగ్' స్టేటస్‌లు లేదా సోషల్ మీడియా పోస్టులు పెట్టకూడదని, ప్రయాణం ముగిసి క్షేమంగా తిరిగి ఇంటికి వచ్చాకే ఫోటోలు షేర్ చేయాలని స్పష్టం చేశారు. పగటిపూట వ్యాపారాల పేరుతో తిరిగే అపరిచితులు మరియు రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వారిపై కన్ను వేసి ఉంచాలని, ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని వివరించారు.

# హోటల్ నిర్వాహకురాలికి బెదిరింపులు..!

- మాట వినకుంటే ఇక్కడ లేకుండా చేస్తా..
- హోటల్‌పై రైడ్ చేయిస్తా అంటూ హెచ్చరికలు..?
- శాయంపేట ఉపసర్పంచ్ సుమన్ పై కేసు నమోదు.

**శాయంపేట,అక్టోబర్ 6,డి డి 9వార్త**




హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో కే వీ ఆర్ హోటల్ నిర్వహిస్తున్న మహిళను బెదిరించారనే ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. హోటల్ నిర్వాహకురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్ తెలిపారు. ఫిర్యాదుదారురాలు స్వప్న తెలిపిన వివరాల ప్రకారం సుమారు నాలుగు నెలల క్రితం శాయంపేటలో కేవీఆర్ హోటల్‌ను ఏర్పాటు చేసి,మహిళా వర్కర్లను సిబ్బందిగా నియమించుకుని హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్‌కు వచ్చే ప్రతి కస్టమర్‌ను వ్యాపారపరంగానే చూస్తూ సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు.ఈ క్రమంలో శాయంపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్ తరచూ హోటల్‌కు వచ్చి భోజనం చేసి వెళ్తుండేవాడని పేర్కొన్నారు. అయితే హోటల్‌లో మహిళా వర్కర్లు వడ్డిస్తుండగా,వారు తనకు వడ్డించవద్దని, నిర్వాహకురాలే స్వయంగా తనకు వడ్డించాలని పలుమార్లు కోరేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.వ్యాపారం దృష్ట్యా కస్టమర్‌గా భావించి అప్పటివరకు ఈ విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు.కానీ ఆ తర్వాత తన గురించి అసభ్యకరంగా, అవమానకరంగా ప్రచారం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.దీంతో ఈ నెల 5వ తేదీన సుమన్‌కు ఫోన్ చేసి తనపై చెడుగా ఎందుకు ప్రచారం చేస్తున్నావని ప్రశ్నించగా నాకే ఫోన్ చేసి ప్రశ్నిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు. అంతటితో ఆగకుండా తన మాట వినకపోతే శాయంపేటలో లేకుండా చేస్తానని,ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి హోటల్‌పై రైడ్ చేయించి వ్యాపారం కొనసాగకుండా చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఒకవైపు మహిళా సిబ్బందితో హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడటం,తన వ్యాపారాన్ని దెబ్బతీస్తానని హెచ్చరించడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని ఆమె పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.దీంతో శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విషయాన్ని సీరియస్‌గా తీసుకుని కేసు నమోదు చేశారు.ఈ ఘటనలో బీఎన్ఎస్ సెక్షన్లు 79, 352, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పరమేశ్వర్ తెలిపారు.

**మహిళా వ్యాపారిపై బెదిరింపులు.. చర్చనీయాంశం...**

శాయంపేటలో మహిళలు నిర్వహిస్తున్న చిన్న వ్యాపారాలపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండకూడదని, రాజకీయ పదవుల్లో ఉన్న వ్యక్తులు తమ హోదాను ఉపయోగించి ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.మరోవైపు హోటల్‌పై అధికారుల ద్వారా తనిఖీలు చేయిస్తానంటూ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో,నిజంగా ఏమైనా అధికారిక ఫిర్యాదు లేదా తనిఖీకి సంబంధించిన అంశం ఉందా..? లేక వ్యక్తిగత వివాదంలో భాగంగానే ఈ బెదిరింపులు జరిగాయా..? అనే కోణంలోనూ పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉందని అంటున్న స్థానికులు.

## బతుకమ్మ ఆడుతూ బీఎల్ఓల నిరసన..

- ఏడాది కాలంగా పెండింగ్‌లో గౌరవ వేతనాలు..
- పండుగకు ముందైనా చెల్లించాలంటూ వినతి
- ఇంటింటికీ తిరిగి ఎన్నికల విధులు నిర్వహించాం.. మా బాధలు పట్టించుకోరా..?

**శాయంపేట,అక్టోబర్ 6, డి డి 9వార్త**

బీఎల్ఓలుగా విధులు నిర్వహిస్తూ ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ తమకు రావాల్సిన గౌరవ వేతనాలు ఇప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ హన్మకొండ జిల్లా శాయంపేట మండల బీఎల్ఓలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తెలంగాణ మహిళలకు అత్యంత ముఖ్యమైన ముందస్తు బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఆడుతూ తమ నిరసనను వ్యక్తం చేసి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీఎల్ఓల సంఘం గౌరవ అధ్యక్షులు వంగేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా సుమారు ఐదు నెలల పాటు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి,ఓటర్ల వివరాల సేకరణతో పాటు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.ఎన్నికల విధుల్లో భాగంగా ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ తిరిగి విధులు నిర్వర్తించినప్పటికీ తమకు రావాల్సిన గౌరవ వేతనం మాత్రం ఇప్పటివరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.2025 మార్చి నుంచి 2026 మార్చి వరకు తమకు రావాల్సిన గౌరవ వేతనాలు ఇప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. గత నెల 22వ తేదీన తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామని, వారం రోజుల్లోగా డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని భూపాలపల్లి ఆర్డీఓ కార్యాలయానికి చెందిన ఎన్నికల డీటీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.అయితే వారం రోజులు గడిచినా తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణలోని ఇతర నియోజకవర్గాల్లో బీఎల్ఓలకు గౌరవ వేతనాలు చెల్లించారని, భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండల బీఎల్ఓలకు మాత్రం ఇప్పటికీ చెల్లింపులు జరగకపోవడం తమను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని అన్నారు.

**పండుగ వేళైనా మా బకాయిలు చెల్లించండి లేకుంటే పస్తులుండాలి....**

బతుకమ్మ పండుగ సమయంలో కుటుంబ అవసరాలకు,పిల్లల ఖర్చులకు డబ్బులు అవసరమవుతాయని,నెలల తరబడి గౌరవ వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బీఎల్ఓలు ఆవేదన వ్యక్తం చేశారు.తమ సేవలను గుర్తించి పండుగకు ముందే పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను ఖాతాల్లో జమ చేయాలని లేకుంటే మా పిల్లలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన బాధ్యతలు నిర్వహించే బీఎల్ఓల సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల బీఎల్ఓల సంఘం అధ్యక్షురాలు దయినంపల్లి జ్యోష్ణ,ప్రధాన కార్యదర్శి అమ్మ కల్పన,సహాయ కార్యదర్శి కవిత,కోశాధికారి భాగ్యలక్ష్మి, బీఎల్ఓలు రత్నమాల, రాజు, తులసి,మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలి
- గౌరవ భృతి, సంక్షేమ సదుపాయాలు కల్పించాలి

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉద్యమకారుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుంజల భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో తమ వంతు పాత్ర పోషించిన ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి, వారికి ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ఉద్యమ సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధాన డిమాండ్లు

ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అర్హులైన వారికి నెలవారీ గౌరవ భృతి, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల కుటుంబాలకు గృహాలు, భూమి,విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులను సమీక్షించి, అర్హత ఉన్న కేసులను ఉపసంహరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల వివరాలను ప్రభుత్వం అధికారికంగా సేకరించి, పారదర్శకమైన విధానంలో గుర్తింపు జాబితాను రూపొందించాలని కోరారు.ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను గుర్తించి ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగం లేదా నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి ఉద్యమకారుల ప్రతినిధులతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రతి డిమాండ్‌పై చర్చించాలని వారు కోరారు. సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వారి సేవలను గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.శంషాద్దీన్ ఎస్. కే, అమృతపాటిల్, భీంరావు, మహిమూద్ ఖాన్.



## గెర్జామ్ గ్రామంలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన యువకులు
- గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా
- గ్రామస్తులు తెలిపిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపుతా

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**



బోథ్ నియోజకవర్గంలోని గెర్జామ్ గ్రామంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను కలుసుకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై స్థానికులతో చర్చించారు.

ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీలో 50 మంది యువకులు మహిళలు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గెర్జామ్ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను తెలిపారు కచ్చితంగా ప్రతీ సమస్యకు పరిష్కారం చూపుతానని భరోసా కల్పించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తా అదేవిధంగా గ్రావెల్ రోడ్లు కావాలని కోరారు కచ్చితంగా త్వరలోనే వాటిని మంజూరు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీపై నమ్మకంతో యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం సంతోషకరమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కలిసి పనిచేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.









# స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కోసం సెంట్రలైజ్డ్ కిచెన్

- **గిడ్డంగిని తనిఖీ చేసిన ప్రభుత్వ సలహాదారు, జిల్లా కలెక్టర్**

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గిడ్డంగిని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఈ భవనం అనుకూలంగా ఉందని నిర్ధారించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని 70 వేల మంది విద్యార్థులకు నిత్యం పోషకాహార అల్పాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కిచెన్ నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్, రహదారి తదితర మౌలిక వసతులను వెంటనే కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఆర్డీఓ సాయన్న, ట్రాన్స్‌కో, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చాయ్ హోటల్ నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం

- **ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**
- **భీమ్‌గల్‌లో రోడ్డుపై బంధువుల ధర్నా**
- **ఎస్సైపై చర్యలకు ఎమ్మెల్యే వేముల డిమాండ్**



**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

భీమ్‌గల్‌లో తీవ్ర కలకలం రేపిన భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చాయ్ హోటల్ నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం ఘటన విషాదాంతమైంది. రాత్రి వేళల్లో హోటల్ నిర్వహణ నిబంధనల పేరుతో నమోదైన కేసుల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురైన చాయ్ హోటల్ నిర్వాహకుడు పొలాస సుధాకర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటన మంగళవారం మరణానికి దారి తీసింది. బాధితుడి కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రిపూట వేళలు దాటి హోటల్ నడుపుతున్నారనే నెపంతో పోలీసులు పలు కేసులు నమోదు చేశారని, సోమవారం స్టేషన్‌కు పిలిపించి, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పడంతో సుధాకర్ మనస్తాపానికి గురై వెంటనే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకుని నిప్పంటించుకున్నాడని పేర్కొన్నారు. తీవ్ర గాయాలైన అతడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశాడు. బాధితుడి మృతితో భీమ్‌గల్‌లో ఉద్రిక్తత నెలకొంది. బంధువులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ.. ఎస్సై తిరుపతి వేధింపుల వల్లే సుధాకర్ ప్రాణాలు కోల్పోయాడని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, సీపీ వేధింపుల ఆరోపణలను ఖండించారు.

## అధికారుల నిర్లక్ష్యం.. రథం చెరువు ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

రథం చెరువులో గుర్రపుడెక్క నివారణ పేరుతో అధికారులు చేపట్టిన డ్రోన్ కెమికల్ పిచికారీ ప్రయోగం ఆయకట్టు పరిధిలోని చిన్న, సన్నకారు రైతుల పాలిట శాపంగా మారింది. శాస్త్రీయ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా డ్రోన్ ద్వారా రసాయనాలు పిచికారీ చేయడంతో చెరువులోని నీరు ఒక్కసారిగా కిందకు ప్రవహించి పంట పొలాలను ముంచెత్తింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోనూ అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతుల పంటలు నీటమునిగి పాడైపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతోంది. అధికారుల తొందరపాటు, నిర్లక్ష్య వైఖరి వల్లే తమకు ఈ గతి పట్టిందని రైతులు మండిపడుతున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వచ్చి రథం చెరువు కట్టతో పాటు దెబ్బతిన్న ఆయకట్టు పొలాలను పరిశీలించాలని, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి బాధితులైన ప్రతి రైతుకూ తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఎన్నికల హామీలు అమలు చేయాలి: సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణంలోని మహాలక్ష్మి మందిర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ షర్బత్ కెనాల్, అంబేద్కర్ చౌరస్తా, రైల్వే గేట్, మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్డీవో ఆఫీస్ వరకు సాగింది. అనంతరం అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో పాటు ప్రజల వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఎం.నరేందర్, జిల్లా సీనియర్ నాయకుడు కే.గంగాధర్ మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లు ఇవ్వాలని, రైతులకు రుణమాఫీని ఏకకాలంలో పూర్తిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నియంత్రించాలని, వ్యవసాయానికి కోతలు లేని విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. వాగ్దానాలు నిలబెట్టుకోకపోతే గత పాలకులకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు డి.రాజేశ్వర్, బి.మల్లేష్, పడాల శంకర్, పిఓడబ్ల్యూ నాయకురాలు బి.నాగమణి, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## పోతంగల్‌లో డీఆర్వో శ్రీమతి గీత గారి అధ్యక్షతన ముమ్మర సమీక్ష

- **కోడిచెర్ల ఇసుక రీచ్ క్షేత్రస్థాయి పరిశీలన**

**పోతంగల్, అక్టోబర్ 6:(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి/పోతంగల్ మండల పరిధిలో స్థానిక పరిపాలన, ప్రగతి పనులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే, గౌరవనీయులైన జిల్లా రెవెన్యూ అధికారి (DRO) శ్రీమతి గీత గారు (డీఆర్వో) ఈరోజు పోతంగల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

ఈరోజు మధ్యాహ్నం 12:00 గంటలకు పోతంగల్‌లోని తహసీల్దార్ (MRO) కార్యాలయం వద్ద ఒక కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఆర్వో శ్రీమతి గీత గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని రెవెన్యూ, అభివృద్ధి మరియు హౌసింగ్ (గృహ నిర్మాణ) పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**సమావేశంలో పాల్గొన్న ముఖ్య అధికారులు:**

ఈ ఉన్నత స్థాయి సమీక్షలో స్థానిక మండల యంత్రాంగం మరియు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. శ్రీ Ch. సందీప్ కుమార్ (తహసీల్దార్, పోతంగల్) శ్రీ K. చందర్ (MPDO, పోతంగల్) DE, హౌసింగ్ విభాగం (పోతంగల్)

**శ్రీ ఆదర్శ్ (AE, హౌసింగ్, పోతంగల్) మరియు ఇతర సిబ్బంది.**

2. కొడిచర్ల ఇసుక రీచ్ క్షేత్రస్థాయి పరిశీలన

తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ముగిసిన అనంతరం, డీఆర్వో గారు నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. పోతంగల్ మండల పరిధిలోని కొడిచర్ల ఇసుక రీచ్ ప్రాంతాన్ని ఆమె స్వయంగా సందర్శించి, క్షుణ్ణంగా పరిశీలించారు.

ఇసుక రవాణా ప్రక్రియ, నిబంధనల అమలు, రీచ్ నిర్వహణ తీరును ఆమె దగ్గరుండి చూశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పారదర్శకంగా పనులు జరగాలని, ఎలాంటి అక్రమాలకు తావుండకూడదని స్పష్టం చేశారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలన మరియు విచారణా సమయంలో డీఆర్వో గారి వెంట మండల సర్వేయర్, మండల గిర్దావర్ (రెవెన్యూ ఇన్స్పెక్టర్) మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది ఉండి, రీచ్‌కు సంబంధించిన రికార్డులను, వివరాలను ఆమెకు వివరించారు.



## ఇందూరు ఖిల్లా అభివృద్ధికి తొలి అడుగు

- **రోప్‌వే నిర్మాణానికి అధికారుల పరిశీలన**

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

తెలంగాణలోని చారిత్రక కట్టడాలలో ఒకటైన ఇందూరు ఖిల్లా రామాలయ రూపురేఖలు మారనున్నాయి. ఖిల్లాను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రూ.180 కోట్లతో పర్వతమాల పథకం కింద రోప్‌వే సహా పలు అభివృద్ధి పనులను చేపట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గతంలో ప్రతిపాదించారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, గజేంద్ర సింగ్ షెకావత్‌లతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లడంతో యంత్రాంగంలో చలనం వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు, ప్రముఖ రోప్‌వే నిర్మాణ సంస్థ 'సీఆర్ఎస్' ప్రతినిధులు మంగళవారం ఖిల్లా రామాలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించారు. మోనో కేబుల్, బై కేబుల్, జిగ్ జాగ్, ట్రై కేబుల్ వంటి అందుబాటులో ఉన్న సాంకేతికతలలో ఇక్కడి భౌగోళిక పరిస్థితులకు అనువైన పద్ధతిని ఎంపిక చేసి, త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఆర్ అండ్ బీ డీఈ మోహన్, రోప్‌వే సంస్థ ప్రతినిధి తన్మయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి చేలలో సుడిదోమ ఆశించే అవకాశం

- **సస్యరక్షణ చర్యలు తప్పనిసరి**

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**




భీంగల్ మండల పరిధిలోని పెద్ద భీంగల్ గ్రామంలో ఏఈఓ డి.స్నేహ మంగళవారం వరి పంట క్షేత్రాలను సందర్శించి పైరు పరిస్థితిని పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కొన్ని పొలాల్లో వరి పంటను పానికల్ మైట్, సుడిదోమ ఆశించినట్లు ఆమె గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. పురుగుల వ్యాప్తిని ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. నివారణ చర్యల్లో భాగంగా ప్రొఫెనోఫాస్ మరియు ప్రొపికోనజోల్ కలయిక మందులను సరైన ప్రమాణాల్లో పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు నిరంతరం పంటను పరిశీలిస్తూ ఉండాలని, పురుగులు లేదా తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటే వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి నివారణా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతం

**పోతంగల్ అక్టోబర్ 06 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని గ్రామ ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నేడు పోతంగల్ గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది. అర్హులైన లబ్ధిదారులందరికీ ఈ కార్డులను అధికారికంగా అందజేశారు.

ఈ విశేష కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు సక్రమంగా అందేలా చూసేందుకే ప్రభుత్వం ఈ డిజిటల్ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని, వీటి ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మండ్లు ,ఉప సర్పంచ్ నబి, పోతంగల్ జివి సెక్రటరీ ప్రతాప్, అలాగే ప్రభుత్వ అధికారి డిటిఎమ్‌ఆర్‌ఓ, ప్రముఖులు ధనరాజ్, గంధపు దత్తు, గణేష్ ధనరాజ్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. రేషన్ కార్డులు అందుకున్న గ్రామ ప్రజలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.





## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పి. నాగనాథ్ సార్‌కు పోతంగల్ గ్రామంలో ఘన సన్మానం జరిగింది.

**పోతంగల్ అక్టోబర్ 06 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కలెక్టర్, డీఈఓ అశోక్ సార్ల ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ZPHS పోతంగల్ పాఠశాల టీచర్ నాగనాథ్‌ను.. గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య హనుమాన్లు, ఎంఈఓ సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంత్, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు, తోటి ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు కలిసి ఈరోజు ఘనంగా సన్మానించారు.



## ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జడ్జి నీలిమ

**నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ జిల్లా జైలు, ప్రభుత్వ బాలుర పరిశీలన వసతి గృహంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎమ్.నీలిమ పర్యటించి అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ పూర్తి న్యాయానికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. పేదలు, మహిళలు, వృద్ధులతో పాటు ఏటా మూడు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా లాయర్లను ఏర్పాటు చేస్తుందని వివరించారు. జైలులో ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తగిన వైద్య సహాయం అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉందన్నారు. అబ్జర్వేషన్ హోమ్‌లోని 15 ఏళ్లలోపు పిల్లలు తమ భవిష్యత్తును పాడుచేసుకోవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆ బాలురలో మానసిక పరివర్తన కోసం నెలకు రెండు సార్లు నిపుణులైన వైద్యులతో కౌన్సిలింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఒకసారి పొరపాటు జరిగినా, మళ్లీ సమాజంలోకి వెళ్లాక నేరాలకు పాల్పడకూడదని హితవు పలికారు. ఈ పర్యటనలో జైలు అధికారులు, అబ్జర్వేషన్ హోమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.





- -అక్టోబర్ 8న హైదరాబాద్ 'బస్ భవన్' వద్ద ధర్నా

**బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో పురుష వికలాంగులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గైని రాములు, ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ మండలం పెంటాఖుర్దు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 34 నెలలు గడుస్తున్నా ఈ హామీని నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం మహిళా వికలాంగులకు ఈ వెసులుబాటు ఉన్నందున, పురుషులకు కూడా వెంటనే వర్తింపజేయాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో వికలాంగుల రాయితీ పాసులను అనుమతించడం లేదని, ఆర్డినరీ బస్సులు తక్కువగా ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 8న హైదరాబాద్‌లోని బస్ భవన్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనే బోధన్ ప్రాంత బాధితులు అక్టోబరు 7న సాయంత్రం 6 గంటలకు బోధన్ కొత్త బస్టాండ్‌కు, నిజామాబాద్ ప్రాంత వాసులు నామ్‌దేవ్‌వాడలోని సిఐటియు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

## కోళ్ల పందేల స్థావరంపై పోలీసుల దాడి

- అదుపులో 8 మంది, 10 కోళ్లు స్వాధీనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 06(డీడీ9 వార్త) :**

బోధన్ మండలంలో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న కోళ్ల పందేల స్థావరంపై బోధన్ రూరల్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసులకు అందిన నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పెంటాఖుర్దు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పందేల స్థావరంపై మెరుపు దాడి చేశారు. బోధన్ రూరల్ ఠాణా ఎస్సై ఎం .రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కోళ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన పందెం రాయుళ్లు అక్కడి నుంచి పరారయ్యేందుకు యత్నించగా, వారిని వెంటాడి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలం నుంచి 10 పందెం కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

## బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపీడీవో రత్నాకర్ రావు

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 06: (డిడి 9 వార్త న్యూస్):**

ఈరోజు సోనాల మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేయడం జరిగింది సోనాలలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఎంపీడీవో రత్నాకర్ రావు తనిఖీ చేశారు. హాస్టల్లోని నిత్యావసర వస్తువులు, వాటి నాణ్యతను పరిశీలించి ఎస్సెచ్‌వో విజయరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు.



## ముంపు గ్రామాన్ని పర్యటించిన తాహీసిల్దార్

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టో-బర్ 06: (డిడి 9 వార్త న్యూస్):**

ఈరోజు బోథ్ మండలం కరత్వాడ గ్రామాన్ని తహిసిల్దార్ సుభాష్ చంద్ర పర్యటించి గ్రామం లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగితేలుసుకున్నారు అలాగే ముంపునకు గురైన వారికీ ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ లను మరియు అక్కడ కట్టుకొని ఉంటున్నా గుడిసెలను (ఇండ్లను) పరిశీలించారు ఈసందర్భంగా సర్పంచ్ దుర్వ విశ్వశ్వర్ రావు అర్హులైన నిరుపేదలందరిని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి నిరుపేదలందరికి ఆదుకోవాలని తహిసిల్దార్ ని కోరారు తహిసిల్దార్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలియచేసారు ఈకార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగోరావ్ గ్రామపాలన అధికారి మందుల కృష్ణ మరియు గ్రామప్రజలు ఉన్నారు







# ఎత్తొండ పీఏసీఎస్ నూతన పాలకవర్గం కొలువుదీరింది:

- చైర్మన్‌గా కోనేరు వెంకట సుబ్బారావు ఘనంగా ప్రమాణ స్వీకారం

**కోటగిరి అక్టోబర్ 06(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఎత్తొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం స్థానిక సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఘనమైన వేడుకలో పీఏసీఎస్ నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలను స్వీకరించింది. ఈ నూతన సంఘం చైర్మన్‌గా కోనేరు వెంకట సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేయగా, ఆయనతో పాటు 12 మంది పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా సంఘం పనులను పర్యవేక్షిస్తున్న పర్సన్ ఇన్‌ఛార్జ్ రియాజుద్దీన్ ఈ నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు.

12 మంది సభ్యులతో పటిష్టమైన పాలకవర్గం:
సహకార సంఘాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని వర్గాల ప్రాతినిధ్యంతో కూడిన 12 మంది సభ్యుల పాలకవర్గం కొలువుదీరింది. బాధ్యతలు స్వీకరించిన సభ్యులు,కమలావార్ వెంకటేష్,

**మన్నె సాయిలు,అగ్గు హనుమంతు,మేతరి లస్మవ్వ,**

బొనిగే శ్యాంసుందర్, ఆలపాటి లక్ష్మి, జి. సరస్వతి,జి. తుక్కమ్మ
ఆర్. రాధిక,బోధన్ ఆనంద్
ఎం. ఫణికుమార్,హెచ్. అశోక్

రైతు సంక్షేమమే మా ఏకైక లక్ష్యం - చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు:
ప్రమాణ స్వీకారం అనంతరం నూతన చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగమైన ప్రసంగం చేశారు. "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అనే గొప్ప నమ్మకంతో తమ పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సహకార సంఘం పరిధిలోని ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సకాలంలో పంట రుణాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

ఈ సందర్భంగా బాన్సువాడ శాసనసభ్యులు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రత్యేక కృషి, నమ్మకం వల్లే తనకు ఈ బాధ్యతాయుతమైన పదవి దక్కిందని గుర్తుచేసుకున్నారు. రాబోయే రోజుల్లో ఆయన అండదండలతో, మార్గదర్శకత్వంలో ఎత్తొండ సహకార సంఘాన్ని జిల్లాలోనే ఆదర్శవంతమైన సంఘంగా తీర్చిదిద్దుతానని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని భరోసా ఇచ్చారు.

పర్సన్ ఇన్‌ఛార్జ్ రియాజుద్దీన్‌కు ఘన సన్మానం:
ఇంతకాలం అత్యంత సమర్థవంతంగా సంఘ వ్యవహారాలను నడిపించి, రైతులకు అండగా నిలిచిన పర్సన్ ఇన్‌ఛార్జ్ రియాజుద్దీన్‌ను నూతన పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఆయన అందించిన సేవలను చైర్మన్ సుబ్బారావు మరియు సభ్యులు కొనియాడారు. అనంతరం రియాజుద్దీన్‌ను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు:
నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎత్తొండ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు నూతన చైర్మన్, సభ్యులకు శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందనలు తెలిపారు. సంఘం సేవలను మరింత వేగవంతం చేసి, రైతాంగానికి మేలు చేయాలని ఆకాంక్షించారు.

ఈ మహత్తర కార్యక్రమంలో స్థానిక సర్పంచులు రొట్టె పుష్పభాయి విఠల్, ఎస్.కె. గౌస్, గైని వీరమణి అర్జున్, బి. అనిత చందులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సహకార సంఘ సిబ్బంది, మరియు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 5 చేతుల పోచవ్వ ఆలయానికి మహర్దశ

- త్వరలో అలయ నిర్మాణానికి నిధులు కేటాయిస్తా - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 06: (డిడి 9 వార్త న్యూస్):**

బోథ్ మండల కేంద్రంలో గల 5 చేతుల ఆలయాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. గతంలో 3 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయ నిర్మాణానికి మిగులు నిధులు మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే ఆలయ పూర్తికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




## పోషకాహార లోపం లేని జిల్లాగా వనపర్తి

- పోషకాహార లోపం లేని జిల్లాగా వనపర్తి
- సామ్ పిల్లల సంఖ్య 438 నుంచి 106కు తగ్గింది..
- మిగిలిన వారిపైనా ప్రత్యేక దృష్టి
- తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు సమష్టి కృషి అవసరం
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,అక్టోబరు 6(డీడీ9 వార్త):**

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పూర్తిగా నిర్మూలించి, వనపర్తి జిల్లాను సామ్, మ్యామ్ పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.

మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను నివారించడంతోపాటు తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

**438 నుంచి 106కు..**

జిల్లాలో గతేడాది 438 మంది సామ్ పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 106కు తగ్గిందని కలెక్టర్ తెలిపారు. పోషకాహార లోపాన్ని గుర్తించి సకాలంలో అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందించడం వల్ల ఈ పురోగతి సాధ్యమైందన్నారు. మిగిలిన పిల్లలపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారు సాధారణ ఆరోగ్య స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో ఎక్కడైనా సామ్, మ్యామ్ పిల్లలను గుర్తించిన వెంటనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

అవసరమైన వారిని పోషక పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్‌సీ) తరలించి, అక్కడ వైద్య చికిత్సతోపాటు తగిన పోషకాహారం అందించాలని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడే వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**రక్తహీనతపై ప్రత్యేక దృష్టి**

మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చని కలెక్టర్ అన్నారు. రక్తహీనత నివారణకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. పోషకాహారంపై కుటుంబాల్లోనూ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**అంగన్వాడీల సేవలు కీలకం**

సామ్, మ్యామ్ పిల్లల సంఖ్యను తగ్గించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

పోషణ మాసం సందర్భంగా గ్రామస్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా ప్రజలకు పోషకాహారం, ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బందిని అభినందించారు.

అప్పుడే పుట్టిన శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషక పదార్థాలతోపాటు రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**సీమంతం.. అన్నప్రాసన.. అక్షరాభ్యాసం**

పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన,అక్షరాభ్యాస కార్యక్రమాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ,జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్ నాయక్,డీపీఆర్వో సీతారాం,సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది,ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ ఎన్నికలలో విజయం సాధించిన బోథ్ వాసి

- -అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న మాసం అనిల్

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 06: (డిడి 9 వార్త న్యూస్):**

బోథ్ గ్రామం కి చెందిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ జిల్లా రెడ్ క్రాస్ ఎన్నికలలో ఘన విజయం సాధించారు సేవా భారతి ప్యానల్ నుండి నామినేషన్ వేసి విజయం సాధించారు సోమవారం ఉదయం 9 గంటలకు జరిగిన ఎన్నికల ఓట్ల కౌటింగ్ లో విజయం సాధించి అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు బోథ్ నుండి గెలిచిన మాసం అనిల్ కుమార్ కి బోథ్ నియోజవర్గ ప్రజలు అందరూ హర్షం వ్యక్తం చేశారు




## ముద్ద చర్మ వ్యాధి నివారణకు పశువులకు టీకాలు..

**చిన్నశంకరంపేట ( డిడి 9 వార్త ) అక్టోబర్ 06**

ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) నివారణకు రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి గీతా మాలిక సూచించారు. మంగళవారం మండలంలోని చందంపేట గ్రామంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుపు రంగు జాతికి చెందిన ఆవులు, ఎద్దులకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా పశువులకు లంపి చర్మ వ్యాధి సోకే అవకాశం ఉందని గీతా మాలిక తెలిపారు. వ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించడంతో పాటు పశువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రైతులకు సూచించారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ నరసింహులు, పాలకవర్గ సభ్యులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



## 'దాదా' షూటింగ్ షురూ..
# సెట్స్‌లోకి బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దాదా' (Dada). జులైలో ఈ సినిమా సెట్‌లో బాలకృష్ణ గాయపడిన విషయం తెలిసిందే. షూటింగ్‌కు దూరమైన ఆయన తాజాగా మళ్లీ సెట్స్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం మైసూర్‌లో 'దాదా' షూటింగ్ జరుగుతోంది. బాలయ్యతో (Balakrishna) పాటు పలువురు నటులు ఈ కీలక షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని మరోసారి కలిసి పనిచేస్తున్న సినిమా ఇది. బాలయ్యను మరింత మాస్ యాక్షన్ అవతార్‌లో చూపిస్తూ.. గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని స్టైలిష్ కమర్షియల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా మంచు మనోజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న 'దాదా' థియేటర్లలోకి రానుంది.



ఈ దసరాకి 'జైలర్ 2'తో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. విజయవంతమైన 'జైలర్' సినిమాకి కొనసాగింపుగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించారు. విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజమూరి కీలక పాత్రలు పోషించారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ''ఈ రెండు నెల్లలో ఇదంతా చేసిన వాడి గురించి ఏదైనా తెలిసుంటుందిగా.. అదేంటి? అసలు వాడెవడు'' అంటూ సూరజ్ ప్రశ్నించడం.. ''టైగర్.. ముత్తువేల్ పాండియన్'' అంటూ రజనీ స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడంతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. 'జైలర్' ఎక్కడైతే ముగిసిందో.. అక్కడి నుంచే ఈ రెండో భాగం కథ కొనసాగనుంది. ట్రైలర్‌లో రజనీ స్టైల్.. స్వాగ్.. తను చేసిన యాక్షన్ హంగామా ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమా తెలుగులో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా విడుదల కానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందించగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.



# టైగర్...
# ముత్తువేల్ పాండియన్

## 'డ్యూ డేట్' అందరిని ఆలోచింపజేస్తుంది.



లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞా నిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్'. వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మిస్తున్న ఈ మూవీకి ఆనంద్. కె. దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవల ఈ చిత్రం ఘనంగా పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మూవీ టీమ్ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్ ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. 'ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ రోజు నుంచి 15 రోజుల పాటు ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో తొలి షెడ్యూల్ పూర్తవుతుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అని చెప్పుకొచ్చారు.

# సీరియల్ కిల్లర్ పాత్రలో ప్రేమలు హీరో..
# సీన్‌పై హైప్ పెంచేస్తున్న అప్డేట్



'ప్రేమలు' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు యంగ్ హీరో నస్లేన్. తర్వాత పలు ప్రాజెక్టుల్లో నటించిన ఈ యంగ్ హీరో ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. సూర్య ప్రధాన పాత్రలో, 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న హై వోల్టేడ్ యాక్షన్ డ్రామా 'సీన్'. సూర్య కెరీర్‌లో 47వ సినిమాగా రాబోతున్న ఈ మూవీని ఎంతో ప్రతిష్టాత్మంగా తెరకెక్కించే పనిలో ఉన్నాడు డైరెక్టర్. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ రిలీజ్ కాగా.. ఇందులో సూర్య డీఎస్పీ ప్రేమ్ రాజ్‌గా కనిపించిన తీరు ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నెలకొల్పింది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో నస్లేన్ ఓ ప్రధాన పాత్రలో నటించబోతున్న విషయం తెలిసిందే.

ఈ క్రమంలోనే తాజాగా నస్లేన్ పాత్రకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో నస్లేన్ ప్రతినాయకుడిగా మరియు సీరియల్ కిల్లర్‌గా నటిస్తున్నట్లు సమాచారం. ఒక సీరియల్ కిల్లర్ చుట్టూ, అలాగే ఉల్లాసంగా, కూల్‌గా అండ్ స్టైలిష్‌గా ఉండే పోలీస్ అధికారిగా సూర్య ఆ కిల్లర్‌ను పట్టుకునే విధానం చుట్టూ ఈ సినిమా కథ సాగుతుంది. ఇది పూర్తిగా ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ తరహా చిత్రమని ఓ వార్త వైరల్ అవుతుండగా.. 'సీన్'పై హైప్ మరింత పెరుగుతున్నది. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నది.

సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోలింగ్స్‌పై నటి రష్మిక స్పందించారు. తాను అందరితోనూ సరదాగా ఉండడాన్ని కొంతమంది తప్పపడుతున్నారని అన్నారు. అలాంటి విమర్శలు చూసి తన ప్రవర్తన మార్చుకోనని స్పష్టం చేశారు. 'రణబాలి' (Ranabaali) సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు పంచుకున్నారు.

"నా ఉద్దేశంలో అందరితో మంచిగా ఉండడం బలహీనత కాదు. నేను (Rashmika) ఉన్నచోట పాజిటివిటీ రావాలని సరదాగా ఉంటాను. దీనికి ఏ పేరు పెట్టినా ఫర్వాలేదు. అందరికీ నేను నచ్చాలని లేదు. నాకు ఇలా ఉండటమే ఇష్టం. నేను నాలా ఉండడానికి నటించాల్సిన అవసరం నాకు లేదు. ఎవరికోసమో నేను మారలేను. నేను సరదాగా ఉండడం వల్ల నా కుటుంబం, ఫ్రెండ్స్ అందరూ సంతోషంగా ఉంటారు" అని తెలిపారు.

**అందుకే 'రణబాలి'కి ఓకే చెప్పా..**

ఇక రణబాలి తనకు చాలా ప్రత్యేకమని రష్మిక అన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణాన్ని వివరించారు. "దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ సినిమాలో నటించాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను. అందుకే ఈ అవకాశాన్ని వదులుకోలేదు. ఇందులో విజయ్ దేవరకొండ హీరో అని తెలిసి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. విజయ్‌తో (Vijay Deverakonda) స్క్రీన్ షేర్ చేసుకొని చాలా కాలమైంది. అందుకే ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం" అని రష్మిక అన్నారు. ఇందులో తన జయమ్మ పాత్ర గురించి మాట్లాడుతూ.. చాలా ఎమోషన్‌తో కూడిన పాత్ర అని.. ప్రేక్షకులకు కచ్చితంగా కనెక్ట్ అవుతుందని చెప్పారు. అక్టోబర్ 16న రణబాలి విడుదల కానుంది.

# అలా ఉండడానికి నటించాల్సిన అవసరం లేదు



# కన్నడ యాక్షన్ ప్రిన్స్‌కు జోడీగా నభా నటేష్ ఫిక్స్..
# సరికొత్త లవ్‌స్టోరీకి రంగం సిద్ధం చేస్తున్న మేకర్స్



టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ నభా నటేష్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టలతో దూసుకుపోతున్నారు. నిఖిల్ హీరోగా వస్తున్న భారీ పాన్-ఇండియా మూవీ 'స్వయంభు'లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ, తాజాగా మరో గోల్డెన్ ఛాన్స్‌ను సొంతం చేసుకున్నారు. కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధృవ్ సర్జా సరసన నభా నటేష్ హీరోయిన్‌గా సెలెక్ట్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా వెల్లడిస్తూ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసింది. పక్కా కమర్షియల్, గ్లామరస్ పాత్రలతో అలరించిన నభా నటేష్, ఇప్పుడు ఒక సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ సినిమాకు 'కెమిస్ట్రీ' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. 'కొంచెం ఆకర్షణ.. కొంచెం మాయ.. ఇంకా ఎన్నో' అనే క్యూట్ క్యాప్షన్ పెట్టారు. ఇక ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ధృవ్ సర్జా వర్షంలో తడుస్తూ ఒకరినొకరు హగ్ చేసుకున్న రొమాంటిక్ లుక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ కొత్త జోడీ లుక్ చూస్తుంటే సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ పీక్స్‌లో ఉంటుందని అర్థమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై కృతి ప్రసాద్, టి.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యువ దర్శకుడు విశాల్ ఆత్రేయ ఈ సినిమాను చాలా డిఫరెంట్‌గా తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రంలో పవర్‌ఫుల్ హీరో పక్కన నభా నటిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. సిల్వర్ స్క్రీన్ మీద ఈ ఫ్రెష్ జోడీ మ్యాజిక్ చూసేందుకు ఆడియన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

"ప్రేక్షకుల్ని ఆద్యంతం అలరించే మంచి వినోదాత్మక చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్" అంటున్నారు నటి మహిమా నంబియార్. శ్రీవిష్ణు హీరోగా ఆమె నటించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానున్న నేపథ్యంలో మహిమ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ...."నేనిందులో ఒడియా అమ్మాయిగా కనిపిస్తా. కానీ, ఈ సినిమాలో హీరోకి నా భాష రాని కారణంగా తనకు నాకు మధ్య వచ్చే కన్ఫ్యూజన్ సన్నివేశాలు అందర్నీ చాలా నవ్విస్తాయి. అవి ఈ చిత్రానికి ఆకర్షణగా నిలుస్తాయి. ఒడిశాలోని కొండ ప్రాంతాలతో పాటు మరికొన్ని కష్టమైన లొకేషన్లలో ఈ చిత్ర పాటల్ని చిత్రీకరించారు. అది నాకు కాస్త సవాల్‌గా అనిపించింది. నా అసలు పేరు గోపిక. నా తొలి తమిళ చిత్ర సమయంలో న్యూమరాలజీ ప్రకారం నాకు ఆ పేరు సెట్ అవ్వదని మా దర్శకుడు నా పేరుని మహిమగా మార్చారు. ఆ తర్వాత దానికి నా ఇంటిపేరు జోడించుకున్నా. నేను ప్రతి భాషలోనూ విభిన్నమైన పాత్రలు చేయాలనుకుంటున్నా. దానికి తగ్గట్లే మలయాళ, కన్నడ, తమిళ, తెలుగులో విభిన్నమైన జానర్లు ఎంచుకుంటున్నా. నేను కేవలం హీరోయిన్ ఇమేజ్‌కే పరిమితమవ్వాలని అనుకోవట్లేదు. ప్రతినాయిక పాత్రలు, తల్లి పాత్రలు, సెకండ్ హీరోయిన్.. ఇలా నటిగా నన్ను నేను సవాల్ చేసుకునే పాత్రల్ని చేయాలనుకుంటున్నా" అని చెప్పారు.

# హీరోయిన్ పాత్రలకే పరిమితం కాను!



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.